శనివారం
04-11-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 133
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

గాజాకు మద్దతుగా జోర్డాన్‌లో 5వేల మంది ర్యాలీ

అమాన్: గాజాలో ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా జోర్డాన్ రాజధాని అమాన్‌లో శుక్రవారం ఐదు వేల మంది భారీ ప్రదర్శన నిర్వహించారు. గాజాపై దాడులు ఆపేలా ఇజ్రాయిల్ మీద ఒత్తిడి తేవాలని తమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఆ దేశంతో చేసుకున్న శాంతి ఒప్పందాన్ని వినియోగించాలని రాజు అబ్దుల్లా-2ను కోరారు. జోర్డాన్, పలస్తీనా జెండాలతో నిరసనకారులు కదం తొక్కారు. 1994 శాంతి ఒప్పందాన్ని ఇంకా రద్దు చేయకపోవడం సిగ్గుచేటని, ఆ దేశానికి తొలొగ్గినట్టేనని నినదించారు. అమాన్‌లోని ఇజ్రాయిలీ దౌత్య కార్యాలయం వద్ద మసీదు సమీపంలో భారీ భద్రత నడుమ ర్యాలీ జరిగింది.

అక్రమాస్తుల కేసులో

జగన్‌కు ఎదురుదెబ్బ

విచారణలో ఎందుకింత జాప్యమని సీబీఐని ప్రశ్నించిన సుప్రీం కోర్టు

జగన్ సహా ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసిన ధర్మాసనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. జగన్ అక్రమాస్తుల కేసు విచారణలో జాప్యం జరుగుతోందని వైసీపీ రెబెల్ ఎంపీ రఘురామకృష్ణరాజు సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. అలాగే జగన్‌పై కేసుల విచారణను హైదరాబాద్ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. విచారణ సందర్భంగా జగన్ కేసులో విచారణ ఎందుకు ఆలస్యం అవుతోందని సీబీఐని ప్రశ్నించింది. విచారణ ఆలస్యానికి గల కారణాలు చెప్పాలంటూ సీబీఐకి నోటీసులు జారీ చేసింది. రఘురామకృష్ణరాజు వేసిన పిటిషన్‌ను ఎందుకు విచారించకూడదో చెప్పాలని ఆదేశించింది. జగన్ సహా కేసులోని ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరికి వాయిదా వేసింది. జగన్ కేసుల విచారణను వేరే రాష్ట్రానికి మార్చాలని ఎంపీ రఘురామ సుప్రీంలో పిటిషన్ వేశారు. తెలంగాణ సీబీఐ కోర్టులో జగన్ కేసులపై విపరీతమైన జాప్యం జరుగుతోందని, 3,071 సార్లు జగన్ కేసును సీబీఐ కోర్టు వాయిదా వేసినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. జగన్ ప్రత్యక్ష హాజరుకు కూడా సీబీఐ కోర్టు మినహాయింపు ఇచ్చిందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా వందల కొద్దీ డిశ్చార్జి పిటీషన్లు వేసినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే రఘురామ పిటిషన్‌పై సుప్రీం అనేక ప్రశ్నలు సంధించింది. జగన్ అక్రమాస్తుల కేసుకు ఎంపీ రఘురామకు ఏమిటి సంబంధమని కోర్టు ప్రశ్నించింది.

రఘురామ ఫిర్యాదుదారు కాదని, బాధితుడు కూడా కానప్పుడు ఆయనెందుకు పిటీషన్ వేశారని సుప్రీం ధర్మాసనం అడిగింది. ఫిర్యాదుదారు కానప్పటికీ పిటీషన్ దాఖలు చేయవచ్చని రఘురామ తరపు సీనియర్ న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే మూడో వ్యక్తి ఎందుకు పిటిషన్ వేశారని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన చెందిన వారా? అని కోర్టు అడుగగా ఎంపీ రఘురామ కూడా వైసీపీ ఎంపీనే అని ఎంపీ తరపు న్యాయవాది సుప్రీం కోర్టుకు తెలియజేశారు.

సమగ్ర కులగణన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో కులగణన చేపట్టాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన జీవనోపాధి, జనాభా సమతుల్యత అన్న అంశాలపై గణన చేపట్టనుంది. అణగారిన వర్గాల మరింత అభ్యున్నతికి ఈ డేటా ఉపయోగపడుతుందని, ఆర్థిక, సామాజిక అభివృద్ధి కల్పించేందుకు దోహదపడుతుందని మంత్రివర్గం ఆకాంక్షించింది. ప్రభుత్వ పథకాలు అందకుండా ఎవరైనా మిగిలిపోయినా ఈ గణన ద్వారా తెలుస్తుందని, తద్వారా వారు లబ్ధిపొందుతారని కేబినెట్ భావించింది. మరిన్ని పేదరిక నిర్మూలనా పథకాలకు, మానవవనరుల అభివృద్ధికి, తారతమ్యాలు తగ్గించేందుకు, అసమానతలు రూపుమాపేందుకు ఈ డేటా చాలా కీలక భూమిక పోషిస్తుందని భావిస్తూ ఈ నెలలోనే కుల గణన ప్రారంభించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ వివరాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మీడియాకు వివరించారు. ఈనెల 7వ తేదీన వైఎస్సార్ రైతు భరోసా. 15న భూపంపిణీ, 28న విద్యాదీవెన పథకాల కింద లబ్ధిదారులకు నిధులు జమ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

జర్నలిస్టులకు 3 సెంట్ల ఇంటి స్థలం

- 2022 జులై నుంచి 3.64 శాతం డీఏ అమలు
- అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు
- 15 నుంచి ఆరోగ్యశ్రీపై అవగాహన
- 7న రైతు భరోసా, 15న భూ పంపిణీ, 28న విద్యాదీవెన
- రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు

కేబినెట్ మరికొన్ని కీలక నిర్ణయాలు...

- 2023-24 ఖరీఫ్ ధాన్యం సేకరణ కోసం మార్క్‌ఫెడ్‌కు రూ.5 వేల కోట్ల రుణ మంజూరుకు ప్రభుత్వం తరపున అవసరమైన గ్యారంటీ అందించేందుకు ఆమోదం.
- అక్టోబరు 30న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల అభివృద్ధి బోర్డు సమావేశం ప్రతిపాదనలకు ఆమోదం
- రహదారులు, భవనాల శాఖలో 467 పోస్టులు అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయాలని నిర్ణయం.
- ఆరోగ్య సురక్ష కార్యక్రమం జనవరి 1 నుంచి ప్రతినెలా నాలుగు క్యాంపులు ప్రతి మండలంలో నిర్వహించాలి. దీనిలో మంత్రులు పాల్గొనాలి.
- నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకూ ఆరోగ్యశ్రీపై మరోసారి అవగాహనా కార్యక్రమం
- మార్కాపురం మెడికల్ కాలేజీలో 21 పోస్టులతో నెఫ్రాలజీ డిపార్ట్‌మెంటు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం.
- రాష్ట్రవ్యాప్తంగా 6790 ప్రభుత్వ ఉన్నత

- మిగతా 2 లో

చంద్రబాబుకు హైకోర్టులో ఊరట

ఆంక్షలు విధించాలన్న సీఐడీ అభ్యర్థన తిరస్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : టీడీపీ అధినేత చంద్రబాబు మధ్యంతర బెయిల్‌పై అదనపు షరతుల విధించాలంటూ సీఐడీ దాఖలు చేసిన అనుబంధ పిటీషన్‌పై హైకోర్టు తీర్పు వెలువరించింది. స్కిల్ కేసు అంశాలపై మీడియాతో మాట్లాడవద్దంటూ, అలాగే, రాజకీయ ర్యాలీలో పాల్గొనవద్దని గతంలో ఇచ్చిన ఆదేశాలు కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. చంద్రబాబు కార్యక్రమాల పరిశీలనకు ఇద్దరు డీఎస్పీలను పెట్టాలన్న సీఐడీ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. సీఐడీ పిటిషన్‌పై బుధవారం వాదనలు ముగించిన ఉన్నత న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెల్లడించింది.

ఏఐజీ ఆస్పత్రి నుంచి చంద్రబాబు డిశ్చార్జి

ఆరోగ్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆస్పత్రిలో చేరిన చంద్రబాబు శుక్రవారం మధ్యాహ్నం 1 గంట

- మిగతా 2 లో

రైతులకు పరిహారం చెల్లించండి

- బ్యాంకు, సొసైటీ రుణాలు మాఫీ చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- కేసీ కెనాల్ ప్రాంతంలో సీపీఐ నేతల పర్యటన

విశాలాంధ్ర-నంద్యాల: వర్షాభావం కారణంగా ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, బ్యాంకుల్లో, సొసైటీల్లో తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నంద్యాల సమీపంలోని కేసీ కెనాల్ పరివాహక ప్రాంతంలో రామకృష్ణ, సీపీఐ నాయకులు పర్యటించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేసీ కెనాల్ వెంట నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. రామకృష్ణ వెంట రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనా యుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ ఉన్నారు. అనంతరం రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ కేసీ కెనాల్ ఆయకట్టు రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 24 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేయలేదన్నారు. ఓవైపు పంట ఎండి... పెట్టుబడి రాక రైతులు నష్టపోతుంటే మరోవైపు నీళ్ల లేక సాగు చేయలేని స్థితి ఏర్పడిం దన్నారు. కేసీ కెనాల్ పరివాహక ప్రాంత రైతులు సైతం నీళ్ల లేక పంట చేతికి రాదనే బెంగతో ఉన్నారన్నారు. తుంగభద్ర నుండి10 టీఎంసీల నీరు ఇప్పటికీ రాలేదన్నారు. శ్రీశైలం జలాశయంలో నీరు అడగంటిందని చెప్పారు. మిరప, పత్తి పంట రైతులు ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టారని, కనీస పెట్టుబడి వస్తుందో రాదో తెలియక సతమతమ వుతున్నారన్నారు. నీళ్ల కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందన్నారు. తెలంగాణ ఎన్నికల కోసం కేంద్రం కృష్ణానది జలాలపై కుట్ర చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో 18 జిల్లాల్లో దాదాపు 400 మండలాలు కరువుకోరల్లో చిక్కుకున్నాయని, కేంద్ర ప్రభుత్వం కరువు బృందాలను పంపి... ఆ మండలాలను పరిశీలిం చాలని, సహాయం అందించాలని రామకృష్ణ కోరారు. రామకృష్ణ వెంట సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, నాయకులు సుబ్బ రాయుడు, సోమన్న, ధనుంజయుడు, నాగరాముడుతో పాటు రైతులు ఉన్నారు.

హైకోర్టులోనే తేల్చుకోండి

- రుషికొండపై జగన్ సర్కారుకు ఊరట
- పిటీషన్‌లో రాజకీయ కోణం కన్పిస్తుందన్న సుప్రీం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రుషికొండ అంశంపై హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీం కోర్టు తేల్చిచెప్పింది. రుషికొండపై అక్రమ నిర్మాణాలు, ఏపీ సీఎం జగన్ క్యాంపు ఆఫీస్ ఏర్పాటుకు వ్యతిరేకంగా విజయవాడకు చెందిన పర్యావరణ వేత్త లింగమనేని శివరామ ప్రసాద్ పిల్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. హైకోర్టులో రుషికొండ కేసు పెండింగ్‌లో ఉన్నందున

- మిగతా 2 లో

రాజ్యసభ చైర్మన్‌కు క్షమాపణ చెప్పండి ఆప్ ఎంపీ చద్దాకు సుప్రీంకోర్టు ఆదేశం 8లో

కనీస వేతనమూ కరువే

గణనీయంగా పెరుగుతున్న తక్కువ వేతన జీవులు

ఐదేళ్లుగా పెరగని సగటు నెల వారీ వేతనాలు

పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చాక కొత్త ఉద్యోగాల మాట అటుంచి ఉన్న ఉద్యోగాలను ఊడబెరికి నిరుద్యోగ సమస్యను పెంచుతున్న మోదీ పాలనలో రోజువారీ కూలీలకు కనీస వేతనమూ కరువైంది. దేశంలో కనీస వేతనం లేని కార్మికుల సంఖ్య భారీగా పెరుగుతోందని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. చిన్నచిన్న దుకాణాలు, సంస్థలలో పనిచేసే వారికి కనీస వేతనాలు అందని ద్రాక్షగా మిగిలాయని తెలిపింది. కనీస వేతనం కన్నా తక్కువ వేతనాలు పొందుతున్న వారు దేశంలో కోకొల్లలుగా ఉన్నారని ఆ సర్వే నివేదిక పేర్కొంది. ఇటీవల సంవత్సరాలలో కనీస వేతనం లభించని కార్మికుల సంఖ్యలో పెరుగుదల అత్యధికంగా ఉంటోందని సర్వే వెల్లడించింది. 2017-18 సంవత్సరంలో నాలుగు కోట్లుగా ఉన్న వేతనంలేని కార్మికుల సంఖ్య 2022-23 నాటికి 9.5 కోట్లకు చేరుకుందని ఆ నివేదిక తెలిపింది. చిన్న, చిన్న దుకాణాలు, విక్రయ సంస్థలలో పనిచేస్తూ వేతనంలేని కార్మికులను అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ఉద్యోగులుగా పరిగణించదు. వేతనంలేని కార్మిక వ్యవస్థ ప్రపంచంలోని 92 దేశాల్లో అమలులో ఉందని ఆ నివేదిక

- మిగతా 2 లో

ఇదీ లోకం!

95 శాతం కేసులు

రాజకీయ ప్రత్యర్థులపైనే...

- ఒక్క బీజేపీ నేతపైనా నమోదు కాని కేసు
- మోదీ జేబు సంస్థలుగా సీబీఐ, ఈడీ
- కాంగ్రెస్, మిత్రపక్ష నేతలనూ వదలని యూపీఏ
- బీజేపీపై ప్రతిపక్ష పార్టీల తీవ్ర విమర్శ

గువహతి: పాలక బీజేపీపై అసోంలోని విపక్షాలు విరుచుకుపడ్డాయి. సీబీఐ, ఈడీలను ఉపయోగించుకొని ప్రత్యర్థి పార్టీలపై ఎడాపెడా కేసులు బనాయిస్తోందని మండిపడ్డాయి. గడచిన నాలుగేళ్లలో 95శాతం సీబీఐ, ఈడీ కేసులన్నీ ప్రత్యర్థి పార్టీల నాయకులపైనే నమోదయ్యాయని, ఒక్క కాషాయ పార్టీ నాయకుడిపైనా కేసు లేదని దుమ్మెత్తిపోశాయి. దీనికి భిన్నంగా యూపీఏ

- మిగతా 2 లో

ఇజ్రాయిల్ అధీనంలోకి గాజా?

- పూర్తిగా చుట్టుముట్టేసిన సైన్యం
- బందీల కోసం రంగంలోకి అమెరికా నిఘా డ్రోన్లు
- తీరు మారకుంటే మద్దతివ్వడం కష్టమే: నెతన్యాహుకు బైడెన్ స్పష్టీకరణ

2లో

పలస్తీనాకు అండగా నిలుద్దాం

40 సోషలిస్టు, కమ్యూనిస్టు యువజన సంఘాల ఉమ్మడి పిలుపు

ఇజ్రాయిల్ దురాక్రమణ తీవ్రరూపం దాల్చిన వేళ పలస్తీనా ప్రజలకు కమ్యూనిస్టు–సోషలిస్టు యువజన సంఘాలు మద్దతు ప్రకటించాయి. గాజాపై దండయాత్రను ఆక్షేపిస్తూ 40 కమ్యూనిస్టు యువజన సంఘాలు సంయుక్త ప్రకటనను వెలువరించాయి. ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణహోమానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళనలు, నిరసనలు జరిపించాలని ప్రపంచ కార్మికులు, యువతకు పిలుపునిచ్చాయి. గాజా స్ట్రిప్, వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ దురాక్రమణ తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశాయి. వీధి పోరాటాలను మరింత ఉధృతంగా కొనసాగించాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరాయి. పలస్తీనా ప్రజల మారణహోమాన్ని, అమానవీయ నిర్బంధకాండను, ఇజ్రాయిల్ సైనిక క్రూరత్వాన్ని ఆక్షేపించాయి. ఆహారం, మంచినీళ్లు, మందులు, విద్యుత్ సరఫరా నిలిపివేసి పిల్లలు, వృద్ధులపై ఏ మాత్రం కనికరం చూపని ఇజ్రాయిల్ అనాగరికతను దుయ్యబట్టాయి. ఇజ్రాయిల్‌కు అమెరికా, బ్రిటన్, నాటో,ఈయూ మద్దతివ్వడాన్ని తీవ్రంగా ఖండించాయి. స్వతంత్ర పలస్తీనాకు సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. ఇజ్రాయిల్ దురాక్రమణ ముగించాలని, స్వతంత్ర పలస్తీనా ఏర్పాటు కావాలని ఆకాంక్షించాయి. పలస్తీనా భూభాగాల్లో అక్రమ కూల్చివేతల నిలిపివేతకు పిలుపునిచ్చాయి. ఇజ్రాయిల్ జైళ్లలో మగ్గుతున్న పలస్తీనా ఖైదీలను విడుదల చేయాలని, ఐరాస తీర్మానం 194 ప్రకారం శరణార్థులు తిరిగి స్వస్థలాలకు చేరుకోగలగాలని ఆస్ట్రియా, బొలీవియా, బ్రెజిల్, బ్రిటన్, అల్జీరియా, బంగ్లాదేశ్ కెనడా, క్రోయేషియా, సైప్రస్, చెక్ రిపబ్లిక్, డెన్మార్క్, గ్రీస్, జర్మనీ, భారత్, ఐర్లాండ్, ఇజ్రాయిల్, ఇటలీ, మెక్సికో, నెథర్లాండ్స్, పాకిస్తాన్, పలస్తీనా, పోర్చుగీస్, రొమేనియా, రష్యా, యుగోస్లేవియా, సెర్బియా, స్లోవేకియా, స్పెయిన్, శ్రీలంక, స్వీడెన్, సిరియా, తజికిస్తాన్, టర్కీ, వెనిజులా దేశాల సోషలిస్టు–కమ్యూనిస్టు యువజన సంఘాలు ఆకాంక్షించాయి.

న్యూజిలాండ్‌లో హంగ్

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. పూర్తి మెజారిటీ సాధించడంలో నేషనల్ పార్టీ విఫలమైంది. దీంతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోంది. అక్టోబరు 14న ఎన్నికలు జరుగగా ఆపై మూడు వారాల పాటు దశలవారీ ఓట్ల లెక్కింపు, ప్రత్యేక ఓట్ల పరిశీలన వంటివి కొనసాగినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. నేషనల్ పార్టీ 48 స్థానాలు గెలుచుకోగా మావోరి పార్టీ ఆరు, గ్రీన్ పార్టీ 15 స్థానాల్లో గెలిచాయి. లేబర్ పార్టీ 34 స్థానాలు, యాక్ట్ న్యూజిలాండ్ పార్టీ 11 స్థానాలు, న్యూజిలాండ్ ఫస్ట్ పార్టీ ఎనిమిది స్థానాలను దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఏ పార్టీకి మెజారిటీ రాలేదు. దీంతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు దిశగా కసరత్తు మొదలైంది.

విశాలాంధ్ర ప్రపంచం

4-7 తేదీల్లో వాతావరణ మార్పుపై చైనా, అమెరికా చర్చలు

బీజింగ్: వాతావరణ మార్పు నేపథ్య సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతులు, తీసుకునే చర్యలపై చైనా, అమెరికా దేశాల మధ్య కూలంకుషంగా చర్చ జరగబోతోంది. వాతావరణ మార్పునకు సంబంధించి కార్యాచరణలు ఎలా ఉండాలనే దానితో పాటు రెండు దేశాల మధ్య సమన్వయంపైనా చర్చ జరగనున్నట్లు చైనా పర్యావరణ మంత్రిత్వశాఖ శుక్రవారం ఓ ప్రకటన తెలిపింది. ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు కాలిఫోర్నియాలో వాతావరణ మార్పుపై అమెరికా, చైనా మధ్య చర్చలు జరుగుతాయని పేర్కొంది. వాతావరణ మార్పు కోసం చైనా, అమెరికా దేశాల ప్రత్యేక దౌత్యాధికారులు జీ ఝెన్‌హువా, జాన్ కెర్రీ ఈ చర్చల్లో పాల్గొంటారని తెలిపింది. వాతావరణ మార్పుపై దుబాయ్‌లో ఐక్యరాజ్య సమితి సదస్సుకు మద్దతుపైనా ఇద్దరు చర్చిస్తారని మంత్రిత్వశాఖ వెల్లడించింది.

ఇజ్రాయిల్ అధీనంలోకి గాజా?

జెరూసలెం: గాజా నగరం ఇజ్రాయిల్ అధీనంలోకి వెళ్లిపోయిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతాన్ని ఇజ్రాయిల్ సైన్యం పూర్తిస్థాయిలో చుట్టుముట్టేసింది. మరోవైపు ఇజ్రాయిల్‌కు అమెరికా సంపూర్ణ మద్దతిస్తోంది. అక్టోబరు 7న జరిగిన దాడికి ప్రతీకారంగా పలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దురాక్రమణకు వంత పాడుతూ డ్రోన్లను రంగంలోకి దించింది. దీంతో గాజా గగనతలంలో అమెరికా డ్రోన్లు చక్కర్లు కొట్టాయి. బందీల కోసం గాలింపులు ముమ్మరం చేశాయి. హమాస్‌కు కేంద్రంగా ఉన్న గాజాను పూర్తిగా చుట్టుముట్టినట్లు ఐడీఎఫ్ అధికారి డానియల్ హగారీ తెలిపారు. కాల్పుల విరమణ ఆలోచన కూడా రానివ్వబోమన్నారు. భూతల దాడులకు తీవ్రస్థాయిలో కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. బందీల కోసం గాలింపుల్లో భాగంగా అమెరికా నిఘా డ్రోన్లు రంగంలోకి దిగినట్లు ఇజ్రాయిల్ అధికారి ఒకరు తెలిపారు. ఇజ్రాయిల్ దాడుల్లో సుమారు పది వేల మంది పలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోగా ఇందులో దాదాపు నాలుగు వేల మంది పిల్లలు ఉన్నట్లు అంతర్జాతీయ మానవతా సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. శరణార్థులు ఆశ్రయం పొందుతున్న తమ నాలుగు స్కూళ్లను ఇజ్రాయిల్ ధ్వంసం చేసినట్లు ఐక్యరాజ్య సమితి తెలిపింది. ఐడీఎఫ్ దాడులు యుద్ధనేరాలని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం పేర్కొంది. దాడులు ఆపాలన్న ప్రపంచ దేశాల సూచనలను ఇజ్రాయిల్ బేఖాతరు చేయడంపై అంతర్జాతీయ సమాజం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. ఇదే క్రమంలో అనేక దేశాల్లో పెద్ద ఎత్తున పలస్తీనాకు అనుకూలంగా ఆందోళనలు, ప్రదర్శనలు జరుగుతుండటం విదితమే.

నెతన్యాహుకు బైడెన్ మొట్టికాయలు

ఇజ్రాయిల్‌కు ఆత్మరక్షణ హక్కు ఉందని వాదించే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తాజాగా ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును మందలించారు. శిథిలాల కింద నుంచి పిల్లలను తీస్తున్న దృశ్యాలు కలచివేస్తున్నాయని, ఈ కారణంగా హమాస్‌పై పోరులో మద్దతును ఉపసంహరించుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ వైమానిక దాడిలో 50 మందికిపైగా మరణించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇది తనకు ఏ మాత్రం నచ్చలేదని బైడెన్ అన్నారు. సామాన్యుల కష్టాలు తీవ్రమవుతుండటంతో అంతర్జాతీయంగా ఆగ్రహం పేట్రేగుతోందని, గాజాలోని సైనిక లక్ష్యాలను నెరవేర్చుకునే అవకాశాలు ఇజ్రాయిల్‌కు సన్నగిల్లుతాయని హెచ్చరిక చేశారు. హమాస్ అంతానికి ఇజ్రాయిల్‌కు పరిమిత సమయమే ఉన్నట్లు అమెరికా అధికారులు ఆ దేశానికి స్పష్టం చేసినట్లు సమాచారం. కొన్ని వారాల్లోగా పని ముగించుకోవాలని సూచించినట్లు తెలిసింది. లేని పక్షంలో కాల్పుల విరమణకు చర్యలు అనివార్యమవుతాయని తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. ఇజ్రాయిల్ దాడులపై ప్రత్యర్థులే కాకుండా మిత్రపక్షాల నుంచి ప్రతిఘటన రావడం, నిరసన గళం పెరుగుతుండటంతో ఆ దేశానికి మద్దతివ్వడం అమెరికాకు సమస్యగా మారుతోందని సమాచారం.

నెతన్యాహుతో బ్లింకెన్ భేటీ

అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ శుక్రవారం ఇజ్రాయిల్ ప్రధానితో ప్రైవేటుగా భేటీ అయ్యారు. టెల్ అవీవ్‌లోని కిర్యా సైనిక కేంద్ర కార్యాలయంలో ఈ సమావేశం జరిగినట్లు ప్రధాన మంత్రి కార్యాలయం తెలిపింది. గాజాలో మహిళలు, పిల్లలు సహా పౌరులకు హానిని తగ్గించడానికి నిర్దిష్ట చర్యలపై చర్చించినట్లు సమాచారం. ఇద్దరు నేతలు ఈ భేటీలో పాల్గొనగా అనంతరం విస్తృత సమావేశం జరిగినట్లు పీఎంఓ పేర్కొంది. గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ మొదలైనప్పటి నుంచి ఆ దేశంలో బ్లింకెన్ పర్యటించడం ఇది మూడోసారి. ఇజ్రాయిల్ పర్యటనకు బయల్దేరేటప్పుడు బ్లింకెన్ మాట్లాడుతూ 'శిథిలాల కింద నుంచి చిన్నారులను వెలికి తీసే దృశ్యాలు కలచివేస్తున్నాయి. అది గాజా అయినా ఇజ్రాయిల్ అయినా కలిగించే బాధ ఒక్కటే. దీనిపై స్పందన అనివార్యం' అని అన్నారు. పౌరుల రక్షణకు అమెరికా కట్టుబడి ఉందని... సాధ్యమైనంత తక్కువ నష్టంలా చర్యలు ఉండాలే ఇజ్రాయిల్‌తో చర్చిస్తానన్నారు.

అమెరికా మద్దతుతోనే ఇజ్రాయిల్ దకూడు: ఇరాన్

అమెరికా మద్దతు లేకపోతే ఇజ్రాయిల్ ఎప్పుడో తోకముడిచేదని ఇరాన్ వ్యాఖ్యానించింది. అమెరికా అండగా నిలవకపోతే ఇజ్రాయిల్ చిత్తు అయ్యేదని ఇరాన్ అధినేత ఖమేనీ ట్వీట్ చేశారు. ఇజ్రాయిల్ దేశాన్ని ఓ యూద సంస్థతో పోల్చుతూ 'యూద సంస్థ అబద్ధం చెబుతోంది. అది గందరగోళంలో ఉంది. అమెరికన్ల మద్దతు లేకుండా ఎక్కువ కాలం పోరు సాగించలేదు. కొద్ది రోజులకే ఓడిపోయేది' అని ఆయన పేర్కొన్నారు.

హెజ్బుల్లాకు 'వాగ్నర్' అధునాతన క్షిపణలు

లెబనాన్ సరిహద్దుల్లోని హెజ్బుల్లాకు అధునాతన క్షిపణులను పంపడానికి వాగ్నర్ గ్రూప్ సిద్ధమైంది. వైమానిక దాడుల కోసం యాంటీ–ఎయిర్‌క్రాఫ్ట్ క్షిపణి వ్యవస్థ ఎస్ఏ–22, ఫిరంగుల సరఫరాపై వాగ్నర్ సంస్థకు, హెజ్బుల్లాకు మధ్య చర్చలు జరిగినట్లు అమెరికా మీడియా పేర్కొంది. ఈ పరిణామాలను అమెరికా నిశితంగా గమనిస్తున్నట్లు వెల్లడించింది.

కనీసవేతనమూ కరువే

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించింది. భారత్‌లో ఇటువంటి కార్మికులలో మూడింట ఒక వంతు మంది స్వయం ఉపాధి కేటగిరిలో ఉన్నారని ఆ నివేదిక వెల్లడించింది. 2017-18లో మొత్తం ఉపాధిలో వీరి వృద్ధి 52 శాతం ఉండగా.. 2022-23లో మొత్తం ఉపాధిలో వీరి వృద్ధి 58 శాతానికి పెరిగిందని తెలిపింది.

సగటు నెలవారీ వేతనాలు 2017-18 మధ్య రూ.19,450గా ఉండగా, 2022-23లో రూ.20.039 వద్ద నిలిచిపోయాయనీ, గడిచిన ఐదేళ్లలో సగటు వేతనాలలో ఎలాంటి పెరుగుదల లేదని ఈ సర్వే వెల్లడించింది. కనీస వేతనాలు పెరగకపోవడం ఉపాధి నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతోందని నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది.

హైకోర్టులోనే తేల్చుకోండి

(మొదటిపేజీ తరువాయి)

అక్కడే పిల్ దాఖలు చేయాలని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. పిటీషన్ రాజకీయ ప్రేరేపితంగా ఉందని సుప్రీం పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టులో కోస్టల్ రెగ్యులేటరీ జోనుకు సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫైనల్ హియరింగ్ ఉండగా, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి విశాఖపట్నం రుషి కొండ మీద ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, సీనియర్ అధికారుల కార్యాలయాల ఏర్పాటు కోసం ఏపీ సర్కార్ అక్టోబర్ 11, 2023న ఇచ్చిన జీవో 2015ను వెంటనే రద్దు చేయాలని పిటీషనర్ కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 48/ఏ ఉల్లంఘనలకు పాల్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యలను వెంటనే నిలువరించాలని పిటీషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఎన్జీటీ, ఏపీ హైకోర్టులో ఈ విషయంపై ఉన్న కేసులు పరిష్కారం అయ్యే వరకు రుషికొండపై ఏ విధమైన నిర్మాణాలు, ప్రారంభ కార్యక్రమాలు జరుగకుండా వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని లింగమనేని శివరామ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు హైకోర్టులో రుషికొండ కేసు పెండింగ్‌లో ఉన్నందున అక్కడే పిల్ దాఖలు చేయాలని సుప్రీం సూచించింది.

సీఎం పిచ్చిపాలన

గవర్నర్ కేంద్రానికి ఫిర్యాదు చేయాలి

మాజీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర రావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో సీఎం జగన్ పిచ్చిపాలన చేస్తున్నారని, టీడీపీ నేతలపై పెడుతున్న కేసులన్నీ జగన్ రాజకీయ కుట్రలో భాగమేనని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. గవర్నర్ ఈ విషయాన్ని తక్షణమే కేంద్రానికి ఫిర్యాదు చేయాలని కోరారు. మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో శుక్రవారం ఆయన పార్టీ నేతలు వర్ల రామయ్య, నక్కా ఆనంద్ బాబుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోండా ఉమా మాట్లాడుతూ ఈ పిచ్చి పనులపై ప్రజలంతా ఆలోచించాలని, కక్ష సాధింపులే ధ్యేయంగా జగన్ వ్యవహరిస్తున్నారని, నిజంగా టీడీపీ అధినేత చంద్రబాబు తప్పుచేశాడనే ఆధారాలు ఉంటే, నాలుగేళ్లపాటు ఆగేవాడా? అని ప్రశ్నించారు. గతంలో దేశంలో అధ్వాన రాష్ట్రంగా బీహార్ పేరు చెప్పేవారని, ఇప్పుడు ఆ స్థానాన్ని ఆంధ్ర ప్రదేశ్ భర్తీ చేసిందని, రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న జగన్, వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ, ప్రజలపై, ప్రతిపక్షాలపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వేధిస్తున్న తీరుపై పక్క రాష్ట్రాలు కథలుకథలుగా చెప్పుకుంటున్నాయని, నిజంగా ఇది ఏపీ ప్రజలకు సిగ్గుచేటన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు పైనే రోజుకో కేసు పెడుతున్నారని వివరించారు. చంద్రబాబు తప్పు చేసినట్టు నిరూపిస్తే అధికారులకు బహుమతులు ఇస్తానని జగన్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ఆశ పెట్టారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో విడుదలైన జీవోలు, ఫైళ్లు అన్నీ అధికారులతో, రిటైర్డ్ అధికారులతో కూలంకషంగా వెతికించారని వివరించారు. నాలుగున్నరేళ్లు అయినా చివరకు ఎక్కడా చంద్రబాబు తప్పు చేసినట్టు నిరూపించగలిగే ఒక్క ఆధారం దొరకలేదని అన్నారు. చివరకు ఎలాగైనా చంద్రబాబును జైలుకు పంపాలనే దురుద్దేశంతో తప్పుడు కేసులు పెట్టడానికి ఈ ముఖ్యమంత్రి సిద్ధమయ్యారని మండిపడ్డారు. నిజమైన కేసులంటే జగన్‌పై సీబీఐ, ఈడీ పెట్టిన కేసులని, ప్రివెంటివ్ ఆఫ్ కరప్షన్ అంటే జగన్ ప్రజల నుంచి కొట్టేసిన రూ.43 వేల కోట్లను ఈడీ జప్తు చేయడం అని చెప్పారు. ఏపీ గొప్పగా అమలు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో

వేల కోట్ల అవినీతి జరిగిందని తప్పుడు కేసు పెట్టి చంద్రబాబును అన్యాయంగా 52 రోజుల పాటు జైల్లో నిర్బంధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసిన టీడీపీ ప్రభుత్వం వాటిలో వివిధ దేశాలకు చెందిన అధునాతన పరికరాలు, సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసి దాదాపు 2.14 లక్షల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించిందని, వారిలో దాదాపు 70 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. అలాంటి గొప్ప ప్రాజెక్టులో చంద్రబాబు తప్పు చేశాడంటూ ఈ ముఖ్యమంత్రి అన్యాయంగా జైలుకు పంపాడన్నారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ రూ.40 వేల కోట్ల దోపిడీని చంద్రబాబు ఆధారాలతో సహా ప్రజల ముందు పెట్టారన్న అక్కసుతోనే ఆయనపై ఇసుక కేసు పెట్టారని మండిపడ్డారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ నాలుగేళ్లలో టీడీపీ నాయకులపై, ఇటీవల చంద్రబాబుపై పెట్టిన తప్పుడు కేసులకు సంబంధించి ఏ ఒక్క కేసులో అయినా ఈ ప్రభుత్వం ఛార్జ్‌షీట్ వేసిందా అని ప్రశ్నించారు. రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా పెడుతున్న కేసులు అయినందునే ఛార్జ్‌షీట్లు వేయడం లేదని అన్నారు.

రాజకీయ ప్రత్యర్థులపైనే...

(మొదటిపేజీ తరువాయి)

పదేళ్ల కాలంలో అనేకమంది కాంగ్రెస్, దాని మిత్రపక్షాల నాయకులపై సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసిందని గుర్తుచేశాయి. రాజకీయ ప్రత్యర్థులను కట్టడి చేసేందుకు ఆయుధంగా సీబీఐ, ఈడీలను బీజేపీ ఉపయోగించుకుంటుందని అసోంలోని 15 పార్టీల యునైటెడ్ ప్రతిపక్ష ఫోరం విమర్శించింది. ఫోరం అధ్వర్యంలో శుక్రవారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో తృణమూల్ కాంగ్రెస్ అసోం రాష్ట్ర అధ్యక్షుడు రిపున్ బోరా మాట్లాడుతూ దేశంలో స్వయంప్రతిపత్తి గల దర్యాప్తు సంస్థల్లో సీబీఐ, ఈడీ అత్యంత ముఖ్యమైనవని, కానీ దురదృష్టవశాత్తు 2014లో బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి సీబీఐ, ఈడీ కాషాయపార్టీ చేతిలో కీలుబొమ్మగా మారాయని, రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపునకు ఆయుధాలుగా మారాయని నిశితంగా విమర్శించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీతో పాటు కాంగ్రెస్, ఎన్‌సీపీ, అస్సాం జాతీయ పరిషత్, సీపీఐ, సీపీఎం, రాయ్‌జర్ దళ్ వంటి పార్టీలు ఫోరంలో భాగస్వాములుగా ఉన్నాయి. బీజేపీ హయాంలో 2019 నుంచి 2023 వరకు సీబీఐ, ఈడీ రాజకీయ ప్రత్యర్థులపైనే 95 శాతం కేసులు నమోదు చేశాయని బోరా విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులపై కాకుండా బీజేపీ నాయకులపై ఒక్క కేసు నమోదైన దాఖలా లేదన్నారు. ఈ నాలుగేళ్లలో మొత్తం 129 కేసులు ప్రతిపక్ష పార్టీల నాయకులపై నమోదయ్యాయని, అందులో అత్యధికంగా 34 కేసులు తృణమూల్ కాంగ్రెస్ నాయకులపై నమోదయ్యాయని, 24 మంది కాంగ్రెస్ నాయకులు, 11 మంది ఎన్‌సీపీ నాయకులపై కేసులు బనాయించినట్లు వివరించారు. 2014 నుంచి 2023 వరకు ఒక్క బీజేపీ నాయకుడిపైనా సీబీఐ, ఈడీ కేసు నమోదు చేయలేదన్నారు. అంతకుముందు సొంత పార్టీ నాయకులపై నమోదైన కేసులను పెండింగ్‌లో పెట్టిందన్నారు. ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, కేంద్రమంత్రి నారాయణ్ రాణె, పశ్చిమబెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారిపై నమోదైన కేసులు అంగుళం కూడా కదలడం లేదని వివరించారు. ఆ నాయకుల కేసులు బీజేపీ వాషింగ్ మిషన్‌లో పడిపోయాయని విమర్శించారు. మరోవైపు, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, అభిషేక్ బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, ఫరూక్ అబ్దుల్లా సహా 56 మంది ప్రతిపక్ష నేతలను ప్రశ్నించడం అరెస్టు చేయడం లేదా వారి ఆస్తులపై దాడులు చేయడం వంటి చర్యలకు పాల్పడినట్లు బోరా వివరించారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కక్ష సాధింపునకు ఇది స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా యూపీఏ పదేళ్ల కాలంలో 26మంది రాజకీయ నాయకులపై సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయని, అందులో 14 మంది ప్రతిపక్ష నాయకులు ఉండగా మిగిలినవారంతా కాంగ్రెస్, దాని మిత్రపక్షాల నాయకులేనని వెల్లడించారు. ప్రతిపక్ష నాయకులకు సమన్లు పంపిన సమయాన్ని బోరా ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రచారంలో బిజీగా ఉన్న దిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేయడాన్ని గుర్తుచేశారు. రాజస్తాన్ ఎన్నికల ప్రచారం ఊపందుకున్న వేళ కాంగ్రెస్ నేత, ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ తనయుడు వైభవ్ గెహ్లాత్‌కు, తృణమూల్ నేత అభిషేక్ బెనర్జీకి సమన్లు పంపారని తెలిపారు. ఎక్కడైతే ప్రతిపక్ష నాయకులు రాజకీయ కార్యకలాపాలు ముమ్మరంగా చేస్తున్నారో...అలాంటి నాయకులకు ఈడీ లేదా సీబీఐ సమన్లు పంపుతున్నాయని ఆరోపించారు. ఆ నాయకులను రాజకీయ కార్యకలాపాలకు దూరం చేయడమే ఇందులో ప్రధాన లక్ష్యమని మండిపడ్డారు. వేలకోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడిన ఆర్థిక నేరస్తులను వెనక్కి తీసుకురావడంలో మోదీ సర్కారు పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

సమగ్ర కులగణన

(మొదటిపేజీ తరువాయి)

పాఠశాలల్లో ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్ నియమించాలన్న పాఠశాల విద్యాశాఖ నిర్ణయానికి ఆమోదం

- 50 ఎకరాల లోపు ఏపీఐఐసీ కేటాయించిన 285 భూ కేటాయింపులకు గ్రీన్‌సిగ్నల్
- పరిశ్రమలకు భూ కేటాయింపుల విధానంలో మార్పు, లీజు విధానం స్థానే సేల్ డీడ్ విధానంలో కేటాయింపు
- అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద గతంలో థర్మల్ పవర్ ప్రాజెక్టు కోసం 1200 ఎకరాలు ఇచ్చిన ఏపీఐఐసీ
- తిరుపతి జిల్లా పేరూరులో ఎంఆర్‌కేఆర్ గ్రూపు హోటల్ నిర్మాణానికి అదనంగా మరో రెండు ఎకరాల భూమి కేటాయింపు
- విశాఖపట్నానికి చెందిన అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేనికి గ్రూప్- 1 ఉద్యోగం
- ఏపీ ఫెర్రోఅల్లాయిస్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు వివిధ రకాల విద్యుత్ డ్యూటీలలో మినహాయింపులు కల్పిస్తూ నిర్ణయం
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు 3.64 శాతం డీఏ ఇవ్వాలన్న ఆర్థికశాఖ ప్రతిపాదనకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్
- రాష్ట్రవ్యాప్తంగా 100 ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు పోస్టుల భర్తీ, ఇందులో 45 పోస్టులు పదోన్నతి, 55 సూపర్ న్యూమరరీ పోస్టులు.
- జోనల్ వ్యవస్థలో మార్పులకు కేబినెట్ నిర్ణయం. ప్రస్తుతం ఉన్న నాలుగు జోన్లను ఆరు జోన్లకు పెంపు, వీటితోపాటు రెండు మల్టీ జోన్లు.
- కర్నూలులో రెండో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, స్టేట్ క్వాజీ జ్యుడీషియల్ అండ్ లీగల్ ఇనిస్టిట్యూషన్స్ ఏర్పాటుకు మరో 100 ఎకరాల భూమి కేటాయింపు
- దేవాదాయశాఖ బలోపేతం కోసం దేవాదాయశాఖ కమిషనర్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ పోస్టు ఏర్పాటు.
- విశాఖపట్నం జిల్లాలో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు, యూజర్ చార్జీల మినహాయింపు
- పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల పునరావాసంలో భాగంగా 3,823 కుటుంబాలకు రిజిస్ట్రేషన్‌లు ఉచితం
- నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం రావూరులో 39.08 ఎకరాల భూమిని రామాయపట్నం నాన్ మేజర్ పోర్టు నిర్మాణం కోసం కేటాయింపు
- జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలన్న ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం
- ప్రముఖ జానపదకళాకారుడు దివంగత వంగపండు ప్రసాదరావు సతీమణి వంగపండు విజయలక్ష్మికి 1000 గజాల ఇంటిస్థలం కేటాయింపు

స్వాగతిస్తున్నాం

జర్నలిస్టులకు ఇంటి స్థలాల నిర్ణయంపై ఏపీయూడబ్ల్యూజే

విశాలాంధ్ర-విజయవాడ: పాత్రికేయులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ప్రకటించింది. చిరకాల డిమాండ్‌కు ఆలస్యంగానైనా ఆమోదం తెలపడం హర్షణీయమని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్థన్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు ఏచూరి శివ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన పాత్రికేయులు అందరికీ స్థలాలు అందేలా నిబంధనలు ఉండేలా చూడాలని కోరారు. అక్రిడిటేషన్ల జారీలో కొన్ని అసంబద్ధ నియమాల కారణంగా వందలాది మంది అర్హులైన పాత్రికేయులు వాటిని పొందలేకపోయారని గుర్తుచేశారు. అక్రిడిటేషన్లు పొందలేని పాత్రికేయులందరికీ ఇళ్ల స్థలాల కేటాయింపులో అవకాశం కల్పించాలని నాయకులు కోరారు.

మోరేకు 200 మంది అస్సాం రైఫిల్స్ జవాన్లు

మణిపూర్‌లో దుండగుల ఆకస్మిక దాడి, పోలీసు హత్య తర్వాత చర్యలు

ఇంఫాల్ : మణిపూర్‌లోని మోరే పట్టణానికి రెండు వందల మంది అస్సాం రైఫిల్స్ సైనికులను హెలికాప్టర్‌లో తరలించారు. ఒక ఆంగ్ల వార్తా సంస్థ నివేదిక ప్రకారం, అక్కడ ఒక పోలీసు హత్యకు గురయ్యారు. పశ్చిమ ఇంఫాల్‌లో ఒక పెద్ద గుంపు ద్వారా సాయుధ మందుగుండు సామగ్రి దోపిడీకి ప్రయత్నించారు. ఇండో–మయన్మార్ సరిహద్దులో రక్షణ బాధ్యత పారామిలటరీ దళానికి ఉంది. మోరే సరిహద్దులో ఒక వాణిజ్య పట్టణం. జాతి హింస, దాని పర్యవసానాలు ఈ ఈ సంవత్సరం మే నెలలో ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్రంలో ఇటువంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అక్టోబరు 31న మోరేలో హెలిప్యాడ్ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న మణిపూర్ పోలీసు అధికారిని అనుమానిత ఉగ్రవాదులు కాల్చి చంపారు. వెనువెంటనే, మోరేకు పంపబడిన ఒక ఉపబల పోలీసు బృందంపై కూడా రెండు చోట్ల సాయుధ వ్యక్తులు మెరుపు దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. నవంబరు 1న 700 మంది సాయుధ దుండగుల గుంపు పశ్చిమ ఇంఫాల్‌లోని ఫస్ట్ బెటాలియన్ ఎంఆర్ క్యాంపస్‌పై దాడి చేసి డీజీపీ పూల్ ఆర్మ్ కోటే, యూనిట్ పూల్ ఆర్మ్ కోటే (క్వార్టర్ గార్డ్) నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ఎత్తుకెళ్లారు. దీనిపై ఇంఫాల్ పోలీస్ స్టేషన్‌లో ప్రథమ సమాచార నివేదికను నమోదు చేసిన మణిపూర్ పోలీసులు, భద్రతా బలగాలు బాష్పవాయు గోళాలను ప్రయోగించాయని గుర్తించారు. 'సాయుధ దుండగులు వారి సేవా ఆయుధాలను లాక్కోవడానికి ప్రయత్నించినప్పుడు ముగ్గురు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది గాయపడ్డారు' అని పోలీసులు పేర్కొన్నారు. గాయపడిన జవాన్లు 39 ఏళ్ల అరూప్ దాస్, 27 ఏళ్ల నల్జిత్ తాలూక్ దాస్, 29 ఏళ్ల లిల్ కాంత రాజ్. సాయుధ దుండగులు అనేక భాష్ప వాయు గన్‌లు, తుపాకులు, మందుగుండు సామగ్రిని కలిగి ఉన్న మ్యాగజైన్‌లను తీసుకెళ్లారు. ఐజీపీ (జైళ్లు), జైలు సూపరింటెండెంట్ కార్యాలయాలు, జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్ గదిని కూడా ధ్వంసం చేసి, కార్లు, వాకీ–టాకీ సెట్‌లను తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వారు మణిపూర్ పోలీస్ కంట్రోల్ రూమ్‌లోని కంప్యూటర్ రూమ్, కార్యాలయం ఎస్‌పీబీ, మణిపూర్ అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ (ఇంటెలిజెన్స్) కార్యాలయంలో కూడా ప్రవేశించి దోచుకున్నారు.

మహమ్మద్ ఫైజల్ ఎంపీ హోదా పునరుద్ధరణ

సస్పెన్షన్ రద్దు చేసిన లోక్‌సభ సెక్రటేరియట్

న్యూఢిల్లీ: లక్షద్వీప్ లోక్‌సభ ఎంపీ మహమ్మద్ ఫైజల్ సస్పెన్షన్ రద్దు అయింది. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ పేర్కొంది. దీంతో ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రెండవసారి పునరుద్ధరించినట్లైంది. హత్యాయత్నం కేసులో శిక్ష రద్దు చేసేందుకు నిరాకరించిన కేరళ హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో లోక్‌సభ సభ్యత్వాన్ని ఫైజల్ తిరిగి పొందగలిగారు. 2009 నాటి కేసులో అక్టోబరు 4న ఫైజల్‌పై రెండవసారి అనర్హత వేటు పడింది. తొలుత కవరట్టిలోని సెషన్స్ కోర్టు పదేళ్ల శిక్ష, రూ.లక్ష జరిమానా విధించడంతో జనవరి 11న ఆయన ఎంపీ హోదాను మొదటిసారి కోల్పోయారు. హత్యాయత్నం కేసులో తనపై విధించిన శిక్షను సస్పెండ్ చేయాలన్న పిటిషన్‌ను తిరస్కరించిన కేరళ హైకోర్టు ఆదేశాలపై మహ్మద్ ఫైజల్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఆయనకు ఊరట లభించింది.

చంద్రబాబుకు హైకోర్టులో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత డిశ్చార్జి అయ్యారు. ఏఐజీకి చెందిన గ్యాస్ట్రోఎంటరాలజీ నిపుణుడు డాక్టర్ కె.రాజేష్ అధ్వర్యంలో జనరల్ మెడిసిన్‌తో పాటు కార్డియాలజీ, పల్మనాలజీ, డెర్మటాలజీ విభాగాలకు చెందిన వైద్య నిపుణుల బృందం ఆయనకు వివిధ వైద్య పరీక్షలు సూచించారు. ఆ మేరకు చంద్రబాబుకు రక్త, మూత్ర పరీక్షలు, ఈసీజీ, 2డీ ఎకో, కాలేయ, మూత్రపిండాల పనితీరు, అలర్జీ స్క్రీనింగ్ ఇతర పరీక్షలు చేసినట్లు సమాచారం. జైలులో ఉన్న ఆయనకు తీవ్ర అలర్జీ, ఇతర అనారోగ్య కారణాల రీత్యా మధ్యంతర బెయిల్ లభించడంతో బుధవారం హైదరాబాద్ చేరుకున్న చంద్రబాబు గురువారం ఏఐజీ ఆస్పత్రిలో చేరారు.

ఇంధన రంగంలో ముందడుగు

- బొగ్గు కేటాయింపులకు మార్గం సుగమం
- ఏపీ ఎండీసీ-జెన్‌కో సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు అవసరమైన బొగ్గు సరఫరాలో ముందడుగు పడిందని, ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న ఏపీఎండీసీ మధ్య ప్రదేశ్‌లోని సుల్యారీలో సొంతగా బొగ్గు గనులను నిర్వహిస్తోందని రాష్ట్ర ఇంధన, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల అవసరాల కోసం అక్కడి నుంచి ఈ బొగ్గును తెచ్చుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఏపీఎండీసీ-ఏపీ జెన్‌కో మధ్య కీలక చర్చలు జరిగాయన్నారు. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఏపీ ఎండీసీ, మైన్స్, ఇంధన శాఖ అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీలు కె.విజయానంద్ (ఎనర్జీ), గోపాలకృష్ణ ద్వివేది (మైన్స్) సమక్షంలో ఏపీ జెన్‌కో, ఏపీ ఎండీసీ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలోని థర్మల్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపై చర్చించారు. ఏపీ ఎండీసీ అధ్వర్యంలోని గనుల ద్వారా వెలికితీస్తున్న బొగ్గును రాష్ట్ర అవసరాల కోసం వినియోగించుకునేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని జెన్‌కో అధికారులను మంత్రి ఆదేశించారు. సుల్యారీ గనుల నుంచి బొగ్గు సరఫరా వల్ల అందుబాటు ధరలో ఏపీ జెన్‌కో థర్మల్ ప్లాంట్లకు బొగ్గు అవసరాలు తీరే వీలుందని, దీనికిగాను నిబంధనల ప్రకారం అనుసరించాల్సిన విధానాన్ని ఖరారు చేయాలని రెండు విభాగాల అధికారులకు సూచించారు. త్వరలోనే ఏపీ ఎండీసీ నిర్వహించే టెండర్ల ప్రక్రియలో నిబంధనల ప్రకారం పాల్గొని తమ అవసరాలకు అనుగుణంగా బొగ్గు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జెన్‌కో అధికారులను ఆదేశించారు. దీనికి ఏపీ ఎండీసీ నుంచి పూర్తి సహకారం అందించాలన్నారు. రాష్ట్రంలో ఇంధన రంగాన్ని పటిష్టం చేసేందుకు సీఎం జగన్ ముందుచూపుతో అనేక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న ఏపీఎండీసీ ద్వారా ఇతర రాష్ట్రాల్లో బొగ్గు గనులను నిర్వహించేందుకు అవసరమైన చేయూతను అందించారన్నారు. అందువల్లే మధ్య ప్రదేశ్‌లోని సుల్యారీలో ఏపీ ఎండీసీ బొగ్గు గనుల్లో ఉత్పత్తి ప్రారంభించామని, నేడు విజయవంతంగా బొగ్గు వెలికితీత జరుగుతోందని చెప్పారు. విద్యుత్ అవసరాలకు కావాల్సిన బొగ్గు గనుల కేటాయింపులపై దృష్టి సారించాలన్న సీఎం వైఎస్ జగన్ ఆలోచనల్లో భాగంగానే ఈ కీలక సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇకపై కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాల్లో కోల్ మైన్స్ కోసం నిర్వహించే వేలంలో ఏపీ ఎండీసీ-ఏపీ జెన్‌కో జాయింట్ వెంచర్‌గా పాల్గొంటాయని వివరించారు. బొగ్గు లభించే ప్రాంతంలోనే జెన్‌కో విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, బొగ్గు రవాణా భారం లేకుండా నేరుగా విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. తద్వారా అధిక విద్యుత్ డిమాండ్ ఉండే వేసవి కాలంలోనూ బొగ్గు కొరత లేకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. అటు గనులు, ఇటు విద్యుత్ రంగంలోనూ దీనివల్ల మరింత పురోగతి సాధ్యపడుతుందని మంత్రి చెప్పారు. ఈ సమీక్షలో జెన్‌కో ఎండీ కె.వి.ఎన్.చక్రధర్ బాబు, గనుల శాఖ డీఎంజీ వి.జి.వెంకటరెడ్డి, ఏపీఎండీసీ సలహాదారులు డి.ఎల్.ఆర్.ప్రసాద్, కె.నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ బిపిన్ కుమార్, జెన్‌కో డైరెక్టర్ ఆంథోనిరాజా పాల్గొన్నారు.

దళితులపై ఆగని దాడులు

జగన్ జమానాలో కంచికచర్ల ఘటన పరాకాష్ఠ: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జగన్ జమానాలో దళితులపై అణచివేత చర్యలకు కంచికచర్ల ఘటన పరాకాష్ఠ అని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'నాలుగున్నరేళ్ల సైకో పాలనలో దళితులకు రక్షణ కరువైంది. జగన్ రెడ్డి ప్రభుత్వంలో డాక్టర్ సుధాకర్ నుంచి డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు ఎంతోమంది దళితబిడ్డలు బలికాగా, తాజాగా మరో దారుణం చోటుచేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల అంబేద్కర్ కాలనీకి చెందిన దళిత యువకుడు కాండ్రు శ్యామ్ కుమార్‌ను కొందరు శాడిస్టులు నిర్బంధించి, నాలుగు గంటలపాటు చిత్రహింసల పాల్జేయడమేగాక... దాహంవేసి మంచినీళ్లు అడిగితే సభ్యసమాజం తలదించుకునేలా మూత్రం పోసి అవమానించారు. ముఖ్యమంత్రి జగన్‌కు ఏమాత్రం మనస్సాక్షి ఉన్నా ఈ అమానవీయ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. బాధిత దళితులకు న్యాయం చేసేందుకు ఏర్పాటైన చట్టబద్ధ సంస్థకు అధిపతి అయిన ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ బాబు ఈ ప్రభుత్వంలో నేనే బాధితుడ్ని అని వాపోవడం దళితులపై అణచివేత చర్యలకు పరాకాష్ఠ' అని లోకేశ్ పేర్కొన్నారు.

'జోడు పదవులు' నోరు విప్పాలి: బహుజన జేఏసీ

కంచికచర్లకు చెందిన కాండ్రు శ్యామ్‌కుమార్‌పై రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఆరుగురు వ్యక్తులు చేసిన దాష్టీకం పట్ల నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ నోరు విప్పాలని, దోషులను అరెస్టు చేసేలా చర్యలు తీసుకోవాలని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కంచికచర్లలోని శ్యామ్‌కుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండేళ్ల క్రితం జరిగిన ఒక సంఘటనతో ఎలాంటి సంబంధం లేని శ్యామ్‌ను రెండురోజుల క్రితం ఒంగోలు గణపవరం ప్రాంతానికి చెందిన హరీశ్‌రెడ్డి నేతృత్వంలో ఐదుగురు వ్యక్తులు వచ్చి నమ్మకంగా ఫోన్ చేసి పిలిపించుకుని కారులో తీసుకెళ్లారని చెప్పారు. కళ్లకు గంతలు కట్టి, కొడుతూ విజయవాడ, గుంటూరు మధ్య తిప్పారని తెలిపారు. దాహం వేస్తుందని అడిగితే ఆరుగురు మూత్రం పోసినట్లు బాధితుడు చెప్పారని వివరించారు. ఈ దారుణంపై తక్షణమే స్పందించాలని, వెంటనే దోషులను అరెస్టు చేయాలని బాలకోటయ్య డిమాండ్ చేశారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకుందాం

పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని పరిరక్షించుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా పత్తికొండలో శుక్రవారం కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పి.రామచంద్రయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, 32 మంది ప్రాణాలు బలిదానం చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకుంటుంటే సీఎం జగన్‌మోహన్ రెడ్డి నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేసే ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు రాజకీయాల కతీతంగా ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు పెద్దయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నజీర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్, సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, ఏఐవైఎఫ్ తాలూకా కార్యదర్శి హనుమేష్, సీపీఎం నాయకులు రంగారెడ్డి, దస్తగిరి, తెలుగుదేశం పార్టీ నాయకులు గుడిసె నరసింహులు, లోక్‌సత్తా పార్టీ నాయకులు ఆనందాచారి, కాంగ్రెస్ నాయకులు నాగరాజు, జనసేన నాయకులు రాజశేఖర్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి రంగన్న, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాక్షస పాలనను ప్రతిఘటిద్దాం

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రాక్షస పాలనను ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సీపీఐ గుంటూరు జిల్లా సమితి సమావేశం కమిటీ సభ్యులు కాబోతు ఈశ్వరరావు అధ్యక్షతన గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లోని వీఎస్‌కే హాలులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ సర్కార్, రాష్ట్రంలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రెండూ కూడా ప్రజల విశ్వాసం పూర్తిగా కోల్పోయాయని, వారు ఇచ్చిన హామీలను పూర్తిగా తుంగలో తొక్కి ప్రజలను అనేక సమస్యల సాగరంలో ముంచివేశారని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు పూర్తిగా సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయని, దానిని పట్టించుకోక పోగా ప్రైవేట్ కార్పొరేట్ వ్యక్తులకు దాసోహమై పని చేస్తున్నాయని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రాన్ని అదానీ రాష్ట్రంగా మార్చే ప్రయత్నం జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్నాడని విమర్శించారు. ప్రకృతి వనాలను, యావత్తు సహజ సంపదను అదానీకి కట్టబెడుతున్నాడని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి నరేంద్ర మోదీ ఆజ్ఞలను శిరసా వహిస్తున్నాడని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ రాష్ట్ర సమితి పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధమవుతున్నదని, అందులో భాగంగా గుంటూరు జిల్లాలో జరిగే ప్రజా పోరాటాలలో సమితి సభ్యులందరూ భాగస్వామ్యమై కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10న విజయవాడలో జరిగే వితంతు, వికలాంగ, వృద్ధాప్య పెన్షన్ల మొత్తాన్ని రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ జరిగే సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలు పడని కారణంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, కరువు మండలాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14, 15 తేదీలలో కృష్ణా జలాల పంపిణీపై కేంద్ర ప్రభుత్వ కుట్రపూరిత ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ విజయవాడలో జరిగే 30 గంటల దీక్షలో అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనే విధంగా చొరవ చూపాలన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కడప నగరంలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని, విభజన హామీలను అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సీపీఐ సిద్ధమవుతుందని తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలపై హర్షం

సీఎంకు మంత్రుల ధన్యవాదాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న రాష్ట్ర కేబినెట్ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ, వెలగపూడి సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌ను రాష్ట్ర మంత్రులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, కొట్టు సత్యనారాయణ, కె నారాయణస్వామి, బూడి ముత్యాల నాయుడు, అంజాద్ బాషా, తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, కేవీ ఉషశ్రీచరణ్, ఆదిమూలపు సురేశ్, డాక్టర్ సీదిరి అప్పలరాజు, మేరుగు నాగార్జున, జోగి రమేశ్ తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టుల అందరికీ ఈ రోజు ఒక చారిత్రిక సందర్భం అని, వై ఎస్ రాజశేఖర్ రెడ్డి తర్వాత మళ్లీ జర్నలిస్టుల గృహ వసతి గురించి సీఎం జగన్ ఆలోచించారని జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధ్వర్యంలో మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడంపట్ల సి. రాఘవాచారి (సీఆర్) ఆంధ్ర ప్రదేశ్ మీడియా అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ లోని జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఇళ్ల స్థలానికి సంబంధించి సీఎం జగన్ సానుకూల నిర్ణయం తీసుకోవడం పట్ల అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు, ఆంధ్ర ప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వివిఆర్ కృష్ణంరాజు హర్షం వ్యక్తం చేశారు.

రూ.145 కోట్ల జీవిత బీమా నిధుల మళ్లింపు దుర్మార్గం: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు ప్రతినెలా చెల్లిస్తున్న జీవిత బీమా సొమ్ము రూ.145 కోట్లను ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఇతర కార్యక్రమాలకు మళ్లించడం దుర్మార్గపు చర్య అని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మంగళగిరి నిధి భవన్‌లోని ఆంధ్రప్రదేశ్ జీవిత బీమా రాష్ట్ర కార్యాలయంలో సంచాలకులు రెడ్డి శ్రీనివాసులును ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏడాదిపాటు ఆంధ్రప్రదేశ్ జీవిత బీమా ఖాతా దారుల మెచ్యూరిటీ, అకాల మరణం చెందిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల కుటుంబాలకు బీమా చెల్లింపులు నిలిచిపోయి ఉన్నాయని, పిల్లల చదువులు పెళ్లిళ్ల కోసం రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సైతం చెల్లింపులు పెండింగ్ పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతి నెలా ఉద్యోగులు,ఉపాధ్యాయులు జీవిత బీమా సభ్యత్వం కోసం వారి వేతనాల నుంచి రూ.145 కోట్లను మినహాయించి చెల్లిస్తున్నారని చెప్పారు. కనీసం ఈ డబ్బులైనా ఖాతాదారుల అవసరాల రీత్యా చెల్లింపు చేయకుండా ప్రభుత్వం ఇతర సంక్షేమ కార్యక్రమాలకు దారి మళ్లించి దుర్వినియోగం చేస్తోందని... ఇది పూర్తిగా నిబంధనలకు వ్యతిరేకమని ఖండించారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు వారి కుటుంబ అవసరాల కోసం దాచుకున్న భవిష్య నిధి, జీవిత బీమా సొమ్ములు దారి మళ్లించడానికి ప్రభుత్వానికి అధికారం ఎవరు ఇచ్చారంటూ నిలదీశారు. కేంద్రీకృత చెల్లింపుల విధానం వల్ల వేతనాల నుంచి, ఆర్జిత సెలవులు, 11వ పీఆర్సీ, కరువు భత్యం బకాయిలను చెల్లింపులు చేయకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఉద్యోగుల సొమ్ములు వాడుకోవడం చట్ట విరుద్ధం కాదా? అని ప్రశ్నించారు. స్వతంత్ర భారతదేశంలో ఏ రోజూ ప్రభుత్వాలు ఉద్యోగుల భవిష్య నిధి, జీవిత బీమా నిధులను దారి మళ్లించలేదని గుర్తు చేశారు. కనీసం ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించే పరిస్థితులు లేవని, దీని ఆధారంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎంతలా దిగజారిందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఇలానే కొనసాగితే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఈ ప్రభుత్వంపై తిరుగుబాటు చేయక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీవిత బీమా చెల్లింపులు, భవిష్య నిధి చెల్లింపులు తక్షణం చేయాలన్నారు. లేకుంటే ఉద్యమాలు చేయడానికి తమ సంఘం వెనుకాడబోదని హెచ్చరించారు. జీవిత బీమా సంచాలకులు రెడ్డి శ్రీనివాసులును కలిసిన వారిలో గుంటూరు జిల్లా ఎస్టీయూ అధ్యక్షులు డీకే సుబ్బారెడ్డి, సీతారామయ్య ఉన్నారు.

'విశాఖ ఉక్కు' పరిరక్షణ...'కడప ఉక్కు' నిర్మాణానికి ఉద్యమిస్తాం

పరుచూరి రాజేంద్రబాబు

విశాలాంధ్ర-ఏలూరు: 32 మంది ఆత్మబలిదానంతో ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీరించే యోచన కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విరమించుకోవాలని, విభజన హామీల్లో ప్రధానమైన కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న విద్యార్థి యువజన సంఘాల అధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం అర్‌ఆర్ పేట స్ఫూర్తి భవన్‌లో 'విద్యాసంస్థల బంద్' పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర బాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేసి అదానికి అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్ని స్తుండగా... దానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వంత పాడుతున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాట కార్యక్రమాలు నవంబర్ 8 నాటికి 1000 రోజులవు తున్న సందర్భంగా విద్యార్థి యువజన సంఘాల అధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తామంటూ నాలుగు సార్లు శంకుస్థాపన చేసినా ఆచరణలో అమలు కావడం లేదని విమర్శించారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటయితే రాయలసీమ జిల్లాలోని నిరుద్యోగులకు ఎంతో ఉపయోగమని, లక్షలాది మందికి పరోక్షంగా ఉపాధి దొరుకుతుందని తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విభజన హామీల ను అమలు చేయడంలో ఘోరంగా విఫలం కావడంతో పాటు వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సమరశీల పోరాటానికి విద్యార్థి యువకులు సిద్ధం కావాలని, అన్ని విధాలుగా మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. విభజన హామీలు, ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ కోసం కుట్రలు చేస్తున్నా పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటరీ అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్, ఏఐఎస్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి గరిక అఖిల్, పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు మంద క్రాంతి కుమార్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తోర్లపాటి రాజు, శేఖర్, వరప్రసాద్ సాయిన బాలు, శివ, జి నాగేంద్ర, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాల జాబితాను పునః సమీక్షించాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వం కరువు మండలాల జాబితాను పునః సమీకక్షించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... రాష్ట్రంలో 26 జిల్లాలు, 669 మండలాలకు గాను 18 జిల్లాల్లో 442 మండలాలలు కరువు బారిన పడగా... రాష్ట్ర ప్రభుత్వం ఏడు జిల్లాల్లో 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడాన్ని ఆయన నిరసించారు. వర్షాభావంతో కరువు కాటుకు గురైన మండలాలన్నింటినీ కరువు మండలాలుగా ప్రకటించాలని, కేంద్ర బృందాలను పరిశీలనకు ఆహ్వానించి కరువు బాధిత రైతాంగాన్ని, కూలీలను ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్ నుంచి అక్టోబర్ చివరి వరకు 725 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా... 505 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసిందని వివరించారు. వర్షాభావంతో 34 లక్షల ఎకరాల్లో పంటలు వేయలేదని, అరకొరగా కురిసిన వర్షాలకు వేసిన పంటలు ఎండ తీవ్రత వలన సాగునీరు అందక ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 442 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి తక్షణమే సహాయక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

10న 2.25 లక్షల వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు

- డిసెంబరు 22న తిరుపతిలో 4.25 లక్షల టోకెన్ల జారీ
- డయల్ యువర్ ఈవోలో ఎ.వి.ధర్మారెడ్డి

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్ : డిసెంబరు 23 నుంచి 2024 జనవరి 1వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించిన 2.25 లక్షల రూ.300 దర్శన టికెట్ల కోటాను నవంబరు 10న ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు 10 రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. తిరుపతిలో 9 కేంద్రాలలో 100 కౌంటర్లలో డిసెంబరు 22న వైకుంఠ ద్వార దర్శనం 10 రోజులకు టైం స్లాట్ సర్వదర్శనం టోకెన్లు 4.25 లక్షలు విడుదల చేస్తామని చెప్పారు. డిసెంబరు 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు ప్రత్యేక దర్శనాలకు చంటిపిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ఎన్ఆర్ఐల దర్శనాలు రద్దు చేస్తున్నామన్నారు. రోజుకు రెండు వేల శ్రీవాణి టికెట్లు తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 23 నుంచి 2024 జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనం కోసం రోజుకు 2 వేల టికెట్లు చొప్పున ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేలు విరాళం ఇవ్వడంతో పాటు రూ.300 దర్శన టికెట్ కొనుగోలు చేయాలి. ఈ టికెట్లను పొందిన భక్తులకు మహా లఘు దర్శనం (జయ విజయుల వద్ద నుంచి మాత్రమే) ఉంటుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టీటీడీకి సహకరించాలని కోరింది.

ఓట్ల కోసం ఏపీపై దుష్ప్రచారం తగదు

కేసీఆర్ విమర్శలకు మంత్రి కారుమూరి కౌంటర్

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: ఎన్నికల ప్రచారంలో ఏపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విరుచుకుపడ్డారు. తెలంగాణ సెంటిమెంట్ పనిచేయబోదని... ఓట్ల కోసం పొరుగు రాష్ట్రంపై విమర్శలు చేస్తారా అని ధ్వజమెత్తారు. ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. వెలగపూడి సచివాలయం మీడియా పాయింట్ దగ్గర శుక్రవారం మంత్రి మాట్లాడారు. ఏపీలో రైతులకు ధాన్యం డబ్బులు పడటం లేదంటూ కేసీఆర్ దుష్ప్రచారం చేయడాన్ని ఆయన ఖండించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ధనిక రాష్ట్రంగా తెలంగాణ, పేద రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ విడిపోయాయని గుర్తుచేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పుణ్యమా అంటూ, పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌లో ఉంటే అవకాశం ఉన్నప్పటికీ రాత్రికి రాత్రే ఓటుకు నోటు కేసుకు భయపడి ఆయన ఈ రాష్ట్రానికి రావడంతో నష్టం జరిగిందన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. ఈ పేద రాష్ట్రాన్ని అన్ని విధాల ముందుకు తీసుకెళుతున్న తరుణంలో దురదృష్టవశాత్తూ కరోనా వచ్చిందన్నారు. అంత సంక్షోభంలోనూ ప్రతిష్ఠాత్మకంగా వైద్య సేవలను సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వ యంత్రాంగం అందించిందని కొనియాడారు. కరోనా పరీక్షల్లో దేశానికి ఆదర్శంగా రాష్ట్రం నిలిచిందన్నారు. అదే తెలంగాణలో కరోనా సమయంలో ప్రజలను కేసీఆర్ గాలికొదిలేశారని... ఎలాంటి వైద్య సేవలు అందలేదని, చివరకు కరోనా పరీక్షలపై కూడా అనేక విమర్శలు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇక హైదరాబాదులో వర్షం పడితే నాలాల్లో పిల్లలు కొట్టుకుపోతున్నారంటూ వ్యాఖ్యానించారు. ఆ విషయాన్ని తెలంగాణ ప్రభుత్వం గుర్తెరగాలన్నారు. ఓట్ల కోసం ఇష్టానుసారంగా కేసీఆర్ మాట్లాడడాన్ని తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని తమ ప్రభుత్వం సమర్థవంతంగా కొనుగోలు చేస్తోందన్నారు. తమ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి మూడు రోజుల్లోనే డబ్బులు వేస్తున్నామని స్పష్టం చేశారు. తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టామన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం లేదని, రైతులకు డబ్బులు సకాలంలో ఇవ్వడం లేదనే అసత్య ప్రచారాన్ని తోసిపుచ్చారు. తెలంగాణ పౌరసరఫరాల శాఖ ద్వారా తెల్ల కార్డు దారులకు కేవలం సాధారణ బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. ఏపీలో మాత్రం కార్డు దారులకు నాణ్యమైన సన్న బియ్యం, కందిపప్పు, గోధుమ, చక్కెర పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే ఉత్తరాంధ్రలో రాగులు, జొన్నల పంపిణీ ప్రారంభించామని తెలిపారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలులో ఏపీనే ముందుందని మంత్రి స్పష్టం చేశారు.

విధానపర నిర్ణయం

కాంగ్రెస్‌కు షర్మిల మద్దతుపై సజ్జల

ఇసుక దోపిడీపై ఆధారాలు ఉన్నాయని వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వైఎస్ షర్మిల మద్దతివ్వడం ఆమె పార్టీ తీసుకున్న విధానపరమైన నిర్ణయం కావచ్చు అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. దిల్లీలోని సోనియా గాంధీ నివాసానికి జగన్‌తో పాటు షర్మిల వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ కుటుంబాన్ని కాంగ్రెస్ ఎన్ని ఇబ్బందులు పెట్టిందనేది ప్రజలకు తెలుసన్నారు. పక్క రాష్ట్రాల రాజకీయాలపై సీఎం జగన్ అంత ఆసక్తి చూపబోరని చెప్పారు. టీడీపీ హయాంలో ఉచిత ఇసుక పేరుతో కుంభకోణం జరిగిందని, ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన వేలకోట్ల రూపాయలు పక్కదారి పట్టించారని విమర్శించారు. టీడీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని, తమ వారికి లబ్ధి చేకూరేలా రెండుసార్లు ఇసుక విధానాన్ని నాటి చంద్రబాబు ప్రభుత్వం మార్చిందని మండిపడ్డారు. ప్రాథమిక ఆధారాలు ఉన్నందునే సీఐడీ కేసు నమోదు చేసిందని స్పష్టం చేశారు. అదే తరహాగా మద్యంలోను పెద్ద కుంభకోణం జరిగిందని, అప్పటి కుంభకోణాలు చంద్రబాబు ప్రభుత్వం దృష్టికి వెళ్లినప్పటికీ పట్టనట్టు ఉన్నారని విమర్శించారు. ఎలాంటి నియమావళిని పాటించకుండా ఇష్టానుసారంగా లిక్కర్ కార్యకలాపాలను కొనసాగించారని దుయ్యబట్టారు. చంద్రబాబు కోసమే బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి పనిచేస్తున్నారని విమర్శించారు. ఆమె బీజేపీ అధ్యక్షురాలా లేక టీడీపీ అధ్యక్షురాలా? అని సజ్జల ప్రశ్నించారు. మద్యం, -ఇసుక అవినీతి వ్యవహారాలపై ఆమె ప్రస్తావిస్తే, చంద్రబాబుపై సీఐడీ కేసు నమోదు చేసినట్లుగా వ్యాఖ్యానించడాన్ని తప్పుపట్టారు. ఎంతోకాలంగా వచ్చిన ప్రాథమిక ఆధారాల ఆధారంగా సీఐడీ విచారించి కేసు నమోదు చేసిందన్నారు. ఆయా కేసుల్లో లోతైన దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు.

సంపాదకీయం

ఆరడి పెడ్తున్న గవర్నర్లు

గవర్నర్‌కు వ్యతిరేకంగా మరో రాష్ట్రం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై సంతకం చేయకుండా నిరవధికంగా తాత్సారం చేస్తున్నందువల్ల గవర్నర్ తన రాజ్యాంగ విధులను నిర్వర్తించడం లేదని ప్రకటించాలని కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అర్జీ దాఖలు చేసింది. ఈ విషయాన్ని నిజానికి సుప్రీంకోర్టు సాధికారికంగా ప్రకటించనవసరంలేదు. ఆయన నడవడిక ఎంత అపసవ్యంగా ఉందో అందరికీ తెలుసు. ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను గవర్నరుగా నియమించింది రాజకీయ దృక్కోణంతోనే కావచ్చు. కానీ ఆయన అనుభవజ్ఞుడే కాదు మంచి చదువరి. గొప్ప పండితుడు. మంచి చెడ్డలు వివేచించగలిగిన జ్ఞానం ఆయన సొంతం. కానీ ఆయన తన రాజకీయ వలువల్ని వదిలించుకోకపోవడంవల్ల రోజూ అక్కడ అధికారంలో ఉన్న వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వంతో ఘర్షణ పడుతూనే ఉంటారు. ఆరిఫ్ ధోరణిచూస్తే ఏ ప్రతిపక్ష పార్టీ అధికారంలో ఉన్నా ఆయన నడవడిక ఇలాగే ఉంటుందనిపిస్తోంది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ సంతకం చేస్తేనే కావి చట్టాలు కావు. అయితే గవర్నర్ సంతకం చేయడానికి నిర్దిష్టమైన గడువు ఏదీ రాజ్యాంగం నిర్దేశించలేదు. రాజ్యాంగం రూపొందించిన సమయంలో ఇలాంటి గవర్నర్లు కూడా భవిష్యత్తులో ఉంటారని ఊహించి ఉండరు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు హుందాగా వ్యవహరిస్తారని, పరిణత మనస్కులై ఉంటారని రాజ్యాంగ నిర్మాతలు భావించి ఉంటారు. ఈ భావన తప్పు అని అనేక మంది గవర్నర్లు నిరూపిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాలకోసం గవర్నర్లను నియమించడం మోదీ హయాంతో పాటే వచ్చిన రుగ్మత ఏమీకాదు. చాలా కాలంగా ఉన్నదే. కానీ మోదీ హయాంలో గవర్నర్లుగా నియమితులైన వారు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ప్రమాదంలో పడవేసేరీతిలో వ్యవహరిస్తున్నారు. కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేయకముందే తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి నడవడికను సవాలుచేస్తూ తమిళనాడులో స్టాలిన్ నాయకత్వంలో ఉన్న డి.ఎం.కె. ప్రభుత్వం ఇదివరకే సుప్రీంకోర్టుకు అర్జీ పెట్టుకుంది. తమిళనాడు గవర్నర్ అక్కడి ప్రభుత్వం తనకు ప్రత్యర్థి అయినట్టు భావిస్తున్నట్టున్నారు. ఆయన శాసనసభకు కూడా అడ్డుతగిలే దుస్సాహసానికి పాల్పడుతున్నారు. పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం సైతం గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్‌పై సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేసింది. కేరళ ప్రభుత్వం రెండేళ్ల కింద ఆమోదించిన మూడు బిల్లులపై ఆమోద ముద్ర వేయకుండా గవర్నర్ ఖన్ తొక్కిపెట్టారు. మరో మూడు బిల్లులు గవర్నర్ ఆమోదం కోసం ఏడాదిపైనుంచి వేచి ఉన్నాయి. శాసనసభలు ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు సంతకం చేయడానికి నిర్దిష్ట గడువు రాజ్యాంగం నిర్దేశించనంత మాత్రాన నిరవధికంగా బిల్లులపై సంతకం చేయకపోవడం సదరు గవర్నరు రాజకీయ పక్షపాత దృష్టినే తెలియజేస్తుంది. కేరళ ప్రైవేటు అడవుల బిల్లును 2023 ఏప్రిల్ 6న గవర్నర్ ఆమోదంకోసం పంపితే అయిదు నెలలు తాత్సారం చేసి ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ సెప్టెంబర్ 18న తీరికగా సంతకం చేసి పంపించారు. ఈ మధ్యకాలంలో ఆయన వామపక్ష ప్రభుత్వంపై కక్ష సాధింపుధోరణి ప్రదర్శించడం తప్ప సాధించిన మహాత్కార్యం ఏమీ కనిపించదు. తాత్సారంచేసి పైశాచిక ఆనందం అనుభవిస్తూ ఉంటే ఇలాంటివారి చిత్తవృత్తికి ప్రగాఢ సానుభూతి తెలియజేయాల్సిందే. ఆరిఫ్ మహమ్మద్‌ఖాన్ కొన్ని బిల్లులను ఉద్దేశపూర్వకంగానే తొక్కి పెడ్తున్నారనిపిస్తోంది. పండితుడు, యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం ఉన్న ఆరిఫ్ మహమ్మద్‌ఖాన్ లాంటి వారే ఇలా వ్యవహరిస్తే కేవలం రాజకీయ కారణాలవల్ల, రాజకీయ నిరుద్యోగం నుంచి విముక్తం కావడానికి గవర్నర్లు అయిన వారి ప్రవర్తన ఇంతకన్నా భిన్నంగా ఉండడానికి అవకాశం లేదు.

దాదాపుగా దేశంలో అత్యధిక రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడూ కొందరు గవర్నరుల ప్రవర్తన వివాదాస్పదమైంది. కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యం కొనసాగుతున్న రోజుల్లో దిల్లీ పెద్దలు గవర్నర్లను రాజకీయ ప్రయోజనాలకోసం ఉపయోగించుకునే వారు. ఒక రాష్ట్రంలో ఏ పార్టీలోనైనా సమర్థులైన నాయకులు ఎక్కువమంది ఉండొచ్చు. కానీ రాజకీయ సమీకరణలవల్ల అందరికీ పదవులురావు. పదవి దక్కని వారు ఏవో తంపులు పెట్టడం మొదటి నుంచీ ఉన్నదే. అలాంటివారి బెడద తప్పించుకోవడానికి వారిని ఏదో రాష్ట్రానికి గవర్నరుగా పంపిస్తున్నారు. లేదా పునరావాసం కల్పించాలనుకున్నప్పుడూ ఆ పదవి కట్టబెడ్తున్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆ రాష్ట్ర గవర్నర్లకు మధ్య నిత్యాగ్నిహోత్రం రగులుతూనే ఉంది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాత ఆర్.ఎస్.ఎస్. నాయకులకు గవర్నర్ బంగళాలలో పునరావాసం కల్పించడం పెరిగిపోయింది. ఇంతకు ముందు గవర్నర్లు ఏదో పదవి ఉంది లెమ్మని సరిపెట్టుకునే వారు. కానీ ఆర్.ఎస్.ఎస్. నుంచి వచ్చినవారు పదవి వచ్చినంత మాత్రాన సంతృప్తి పడరు. తమ సైద్ధాంతిక దృక్కోణాన్ని అమలు చేయాలనుకుంటారు. తమను కేంద్రం నియమించింది కనక బీజేపీకి అనుకూలంగా నడుచుకుని రుణం తీర్చుకోవాలనుకుంటారు. కేరళ, తమిళనాడు గవర్నర్లు ఈ బాపతే. అలాంటప్పుడు అత్యుత్సాహం ప్రదర్శించడం మామూలే. రాష్ట్రపతి పదవే మన వ్యవస్థలో అలంకారప్రాయమైంది అయినప్పుడు గవర్నర్ పదవీ దానికి అతీతం కాదు. గవర్నర్లకు పరిపాలనాధికారాలు ఉండవు. రాష్ట్ర మంత్రివర్గ సిఫార్సులకు అనుకూలంగా గవర్నర్లు నడుచుకోవలసి ఉంటుంది. చట్టసభ ఆమోదించిన బిల్లుపైనో, ప్రభుత్వం తీసుకునే మరో నిర్ణయం మీదో గవర్నర్ స్థానంలో ఉన్న వారికి భిన్నాభిప్రాయం ఉండొచ్చు. అలాంటి సందర్భాలలో ఆ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తన అభిప్రాయం తెలియజేయవచ్చు. ప్రభుత్వం పంపిన బిల్లుపై గవర్నరుకు అసమ్మతి ఏదైనా ఉంటే ఆ బిల్లును పున:పరిశీలనకోసం శాసనసభకు పంపొచ్చు. చట్ట సభ పరిశీలించి తగిన మార్పులు చేయొచ్చు. చేయకుండానూ ఉండొచ్చు. ఏ మార్పు చేయకుండా రెండోసారి గవర్నర్ ఆమోదంకోసం పంపితే సంతకం చేయడం తప్ప గవర్నరుకు మరో మార్గమేలేదు. ప్రభుత్వ సిఫార్సును ఆమోదించడం నైతికంగా తనకు సరిపడదనుకుంటే రాజీనామా చేసి వెళ్లి పోవడం తప్ప గత్యంతరం లేదు. కానీ చాలా మందికి రాజ్ భవన్లు పునరావాస కేంద్రాలే కనక అంత సులభంగా పదవి వదులుకోవడానికి ఇష్టపడరు. పేచీకోరు గవర్నర్లు చేస్తున్న పనేమిటంటే బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా జాప్యం చేయడం. కొందరైతే శాసనసభ సమావేశాలు ఫలానా తేదీ నుంచి నిర్వహించాలని సిఫార్సుచేస్తే దానిమీద కూడా నిర్ణయం తీసుకోకుండా మోకాలడ్డుతున్నారు. గవర్నర్ల మంకుతనం సుగమ పరిపాలనకు ఆటంకం కల్పించడమే కాక రాజ్యాంగ విరుద్ధం కూడా. అంతకన్నా మించి బాధ్యతల విస్మరణే. గవర్నర్ల తీరుపై ఎనిమిది రాష్ట్రాల ముఖ్యమంత్రులు గత మార్చిలో ప్రధానికి లేఖ రాశారు. ఈ ఫిర్యాదులను నిశితంగా పరిశీలించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. గవర్నర్లను నియంత్రించే అధికారం న్యాయవ్యవస్థకు లేదు. గవర్నర్ల నడవడిక తరచుగా ప్రశ్నార్థకం అవుతోంది. అందువల్లే అసలు గవర్నర్ల వ్యవస్థనే రద్దు చేయాలన్న వాదనలు బలం పుంజుకుంటున్నాయి.

మధురమైన మధునాపంతుల

చక్రవాకం

\- ముక్కాముల చక్రధర్

పచ్చని పొలాలు పసి పాపల్లా నవ్వులు చిందించడం చూశారా.! పిల్ల కాలువపై వాన చినుకులు పడుతూంటే ఆ కాలువ కితకితలతో తెరలు తెరలుగా రెండు గట్లను వొరుసుకుంటూ ఆనందపడడం మీకెప్పుడైనా అనుభవంలోకి వచ్చిందా...! పొలాల్లో కలుపుతీస్తూ ఆ పక్కనే రోడ్డు మీద ప్రయాణిస్తున్న ఆధునికుల్ని జాలిగా చూస్తున్న పాటక స్త్రీలు మీ కెక్కడైనా తారసపడ్డారా..! కుక్కర్ విజిల్‌తో అన్నం ఉడికిందని తెలుసుకుంటున్న మీకు మట్టికుండల్లో కుతకుత శబ్దంతో సిద్ధమైన వొణ్ణం మీ కంచంలోకి వస్తే ఆ రుచి ఎలా ఉంటుందో ఎప్పుడైనా తెలుసుకున్నారా...! సరే, సుబ్రహ్మణ్య షష్టికో, అమ్మవారి తీర్థం నాడో ఆ దేవుళ్లిద్దరిని పల్లకిలో ఊరేగించినట్లుగా ఓ తెలుగు కావ్యాన్ని గ్రామమంతా పల్లకిలో ఊరేగించడం గురించి మీకెవరైనా చెప్పారా. ముందు చెప్పిన ఆ ప్రకృతి, తర్వాత జరిగిన సంఘటన ఓ కుగ్రామంలో జరిగాయంటే నమ్ముతారా... మీరెప్పుడైనా పల్లిపాలెం వెళ్లారా. ముఖ్యంగా తెలుగు సాహిత్యకారులు, సాహిత్యాభిమానులకు పల్లిపాలెం తెలుసా. ఫ్రెంచ్ యానాంకు పదిలైన్ల మినీ కవితంత దూరం. అంటే పది క్రోసులన్నమాట. అక్కడికి వెళ్లండి. అక్కడ ఆంధ్రీ కుటీరం పేరుతో ఓ ఇల్లుంటుంది. అదే ఆంధ్రపురాణం రాసిన మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారి స్వగ్రామం. అక్కడ ఊరేగించిన రచనే ఆంధ్రపురాణం. ఈనాటి తెలుగుస్థితి గురించి మనం ఇప్పుడు కన్నీరు కారుస్తున్నాం కానీ... ఆనాడే మధునాపంతుల వారు "తెలుగు బానకు చీకటులా శతాబ్దముల్" అని వగచారు. ఆనాడు తెలుగు మీద పెత్తనం అంతా సంస్కృతానిదైతే, నేటి దొరతనం ఇంగ్లీషుది. ఈ నెల 7వ తేదీ నాటికి మధునాపంతుల వారు దివికేగి మూడున్నర దశాబ్దాలు దాటుతోంది. పెద్దల్ని స్మరించ ఽకోవడమంటే వారి అడుగు జాడల్ని కాపాడుకుంటున్నామని గుర్తు చేసుకోవడం. ఆ దారుల్లో పేరుకుపోతున్న రాళ్లు, రప్పలని వారి స్ఫూర్తితో బాగుచేసుకుంటున్నామని మనకి మనం సమాధానం చెప్పుకోవడం.

ఈ మధ్యనే నేను మూడోసారి పల్లిపాలెం వెళ్లాను. మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి వారసుడు సత్యన్నారాయణను కలిసేందుకు. ఫొటోలు తప్ప పెద్దాయిన్ని చూసి ఎరిగిన వాళ్లం కాదు కదా. ఈనాటి సత్యనారాయణలో ఆ మహాకవి ముడతలు ముడతలుగా దాగి ఉన్నట్లు అనిపించింది. ఆంధ్రీ కుటీరంలో అడుగు పెట్టడం నా మటుకు నాకు సరస్వతీదేవి సందర్శనగానే తోచింది. నెపాన్ని కాసేపు ఆయుర్వేదం వైపు నెట్టేసి చుట్టూ పుస్తకాల మధ్య, అప్పుడప్పుడు పొగచూరుతున్న నేటి మధునాపంతుల పద్య ప్రవాహంలో తానమాడడం ఓ తీయని జ్ఞాపకం.

సమాజాన్ని దిశానిర్దేశం చేయాల్సింది సాహిత్యమే. ఆ ఎరుక నేటి సాహిత్య వాతావరణంలో అంతగా కనిపించడం లేదు కాని, ఆనాటి సాహితీవేత్తలు మాత్రం ఆ పనిని మనస్ఫూర్తిగా చేశారు. కందుకూరి కాని, శ్రీపాద కాని, శ్రీశ్రీ అయినా, చెలమైనా, పాశ్చాత్య రచయితలు టాల్‌స్టాయ్, మాక్సిం గోర్కి మన ఉత్తరాది, దక్షిణాది రచయితలు చేసిన పని కూడా అదే. ఇప్పుడు మనకు అదేదో దేశోద్ధారణ అనిపిస్తుంది కాని, అలాంటి సామాజికాంశలనే ప్రధానంగా ప్రస్తావించారు ఆనాటి సాహితీవేత్తలు. అలాంటి వారిలో మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి పేరు ముందుంటుంది. అందులో ప్రధానమైనది దళితులకు సంస్కృతం నేర్పడం. అది కూడా ఆయన స్వగృహంలోనే వారిని తన దగ్గరే ఉంచుకుని నేర్పించాలనుకున్న మహదాశయం మధునాపంతుల వారిది. ఆశించడం కాదు... ఆచరణలోనే పెట్టారు సత్యనారాయణ శాస్త్రిగారు. దళితులకు సంస్కృతం నేర్పుతాం. ఆసక్తి ఉన్నవారు సంప్రదించండంటూ ఏకంగా ఆంధ్రపత్రికలో ఓ ప్రకటనే ఇచ్చారు శాస్త్రి. దీనికి స్పందించి రంగూన్ నుంచి ఓ దళిత యువకుడు పల్లిపాలెం కూడా వచ్చారు. కొన్నాళ్ల పాటు ఆంధ్ర కుటీరంలో ఉండి సంస్కృతం నేర్చుకున్న ఆ యువకుడు వొంటరితనం పెట్టిన ఇబ్బందిని భరించలేక పిఠాపురంలో ఉన్న రాజా వారి అనాథ శరణాలయంలో చేరారు. అక్కడే ఉద్యోగిగా స్థిరపడడం అప్పుడే కాదు... నేడు కూడా సాహిత్యం సమాజానికి ఆలంబన కావాలనే దానికి సజీవ సాక్ష్యం. ఎప్పుడో స్వాతంత్రానికి పూర్వం 1938 సంవత్సరంలో ప్రారంభమైన ఆంధ్రీ కుటీరం నేటికి సజీవంగా ఉండడమే కాదు.... ప్రతి ఏటా సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడం ఆ కుటుంబం సాహిత్యానికి ఇచ్చిన ప్రాధాన్యంగానే పరిగణించాలి. ఉద్యోగంలో భాగంగా కొన్నాళ్ల పాటు రాజ మహేంద్రవరంలో ఉన్నారు మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి. ఆ తర్వాత చాలాకాలానికి ఆయన నివాసం ఉన్న లలితానగర్‌కు మధునాపంతుల వారి వీధి అని నామకరణం చేసింది ఆనాటి మున్సిపాల్టీ. దీనికి మధునాపంతుల వారు ఆనందపడిపోలేదు... గుట్టుగా సంసారాన్ని ఈదుకొస్తున్న నన్ను రోడ్డు కీడ్చేశారు మీరు అని మున్సిపల్ కమిషనర్‌తో సరదాగా వాదులాడిన నిజమైన సాహితీవేత్త, సంఘ సంస్కర్త మధునాపంతుల వారు. రాజమండ్రిలో కొన్నాళ్లు ఉద్యోగంచేసిన నేను కావాలనే ఆ వీధిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉన్నాను. రోడ్లకు నమస్కారం అంటాడు అజంతా ఓ కవితలో. నేను రాజమండ్రిలో ఉన్నన్నాళ్లూ ఆ వీధికి నమస్కరిస్తూనే ఉన్నాను మధునాపంతుల వారి మీద భక్తితో. అన్నట్లు ఆ కుటుంబం నుంచి నా కేరాఫ్ కూచిమంచి అగ్రహారం కథలకి ఆంధ్ర కుటీరంలోనే మధుశ్రీ అవార్డు కూడా అందుకున్నాను. ఓ రచయితగా నేను ఆనందపడిన ఘడియలేమైనా ఉంటే అందులో కొన్ని ఆంధ్ర కుటీరంలో అందుకున్న ఆ పురస్కారం నుంచి వచ్చినవే.

సీనియర్ జర్నలిస్టు, ఫోన్: 99120 19929

అంగడి సరుకైన ప్రజా ప్రతినిధులు



సంగిరెడ్డి హనుమంతరెడ్డి



ప్రజాప్రతినిధులైన పాలకులు ఏనాడో వాణిజ్యవేత్తల వస్తువులుగా మారారు. ఈనాడు సరుకులు అయ్యారు. విలువలను, విధులను మరిచారు. యథా రాజా తథా ప్రజా. చైతన్యశక్తులు బలహీనమయ్యాయి. ప్రజా ఉదాసీనత పెరిగింది. పాలితుల విధులు, బాధ్యతలు, పౌరవిలువలు, ఓటర్ల కర్తవ్యాలు కూడా సరుకులుగా మార్చారు. కేవలం ఉపయోగ విలువకలిగి, ప్రయోజనాలను మాత్రమే కలిగించే పదార్థం వస్తువు. అమ్మకాలు, కొనుగోళ్ళకు గురయిన వస్తువు సరుకు. అంటే నేటి నాయకుల బాధ్యతలు, విధులు, ప్రజల అభిప్రాయాలు, ఓట్లు అమ్మకాలకు, కొనుగోళ్లకు గురవుతున్నాయన్నమాట. ఈ స్థితికి పాలకులదే బాధ్యత.

అంతర్యుద్ధాన్ని సమర్థతతో ఎదుర్కొని బానిసత్వ నిర్మూలన చట్టంచేసిన అమెరికా పూర్వ అధ్యక్షులు అబ్రహాం లింకన్ వర్ణించినట్లు ప్రజల కోసం, ప్రజల చేత ఏర్పడే ప్రజల ప్రభుత్వం ప్రజాస్వామ్యం. కోట్లాది ప్రజలు పాలనలో పాల్గొనలేరు. వారి ప్రతినిధులు ప్రజల తరఫున నిర్ణయాలు తీసుకుంటారు. ప్రభుత్వం, చట్టాల ఏర్పాటు, కార్యనిర్వహణలలో పాల్గొంటారు. ఈ ప్రజా ప్రతినిధులు ప్రజలకు బాధ్యులుగా, విశ్వాసపాత్రులుగా, శ్రేయోభిలాషులుగా ఉండాలి. ఎన్నికల ద్వారా ప్రజాప్రతినిధులను నియమిస్తారు. ప్రాంతాల, ప్రజాసాంద్రత ఆధారంగా నిర్ణయించిన నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల ఎన్నికల్లో అర్హతగల పౌరులు పోటీ పడతారు. ఓటు హక్కుగల పౌరులు వారికి ఓటేస్తారు. ఎక్కువ ఓట్లు పొందిన అభ్యర్థులు ప్రజాప్రతినిధులవుతారు. మెజారిటీ పార్టీ, లేదా కూటమి నాయకుడు ముఖ్యమంత్రి, లేదా ప్రధానమంత్రి అవుతారు. ప్రభుత్వ అధిపతి అవుతారు. ప్రజాస్వామ్యంలో సూత్రప్రాయంగా ప్రజలే నాయకులు. ప్రజాప్రతినిధులు ప్రజల ఆకాంక్షలను, అవసరాలను తీర్చే నిర్ణయాలు తీసుకోవాలి. చట్టాలు చేయాలి. స్వార్థానికి, స్వార్జనకు, ఆశ్రిత పక్షపాతానికి పాల్పడరాదు. ఆదాయ, లాభాల పదవులు చేపట్టరాదు. కొందరు లాభార్జనల వాణిజ్యవేత్తలుగా కొనసాగుతున్నారు. నేడు దీనిపై నియంత్రణ లేదు. ప్రజలు సమాజానికి బాధ్యతలుగల సజీవ స్తంభాలు. జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించడం, చట్టాలను పాటించడం, దేశాధికారాన్ని, సమైక్యత సమగ్రతలను, ప్రజల ఆస్తులను కాపాడటం, పన్నులు చెల్లించడం, సాంస్కృతిక వారసత్వ స్థలాల, ప్రకృతి, పర్యావరణాల భద్రత, సంరక్షణ, సౌభ్రాతృత్వ నిర్వహణ రాజ్యాంగం నిర్దేశించిన పౌరుల నైతిక బాధ్యతలు, విధులు. ప్రజలు తమ హక్కులనే కాదు, బాధ్యతలనూ తెలుసుకోవాలి, నిర్వహించాలి. ఇవి సమాజ వికాసానికి, దేశ ప్రగతికి దోహదపడతాయి. చాలామంది పార్లమెంటు, శాసనసభల సభ్యుల పాత్ర, బాధ్యతలు తెలియవు. ప్రజాహక్కుల రక్షణ ప్రజాస్వామ్య లక్ష్యం. సమానత్వ, మత స్వేచ్ఛ, దోపిడీ నిరోధం, సంస్కృతి, విద్య, ఆరోగ్యం, స్వేచ్ఛ మొదలగు ప్రాథమిక హక్కులను రాజ్యాంగం ప్రజలకు ఇచ్చింది. ఈ హక్కుల భద్రత ప్రభుత్వ బాధ్యత. ప్రజలకు విద్య, వైద్యాలను ప్రభుత్వమే ఉచితంగా అందించాలి. శాస్త్రీయ దృక్పథం, మానవవాదం, జిజ్ఞాస, సంస్కరణల స్ఫూర్తి పెంపుకు పౌరులు పాటుపడాలని రాజ్యాంగం ఆదేశించింది. ఒకరి హక్కులో మరొకరి బాధ్యత ఉంటుంది. పాలకులూ ప్రజలే. వారు బాధ్యతల నిర్వహణలో ఆదర్శంగా ఉండాలి. అప్పుడే ప్రజల హక్కులకు రక్షణ ఉంటుంది. బాధ్యతలు, విధులపై ప్రజల పట్టనితనం కంటే పాలకుల అశ్రద్ధ సమాజానికి, దేశానికి ఎక్కువ హానిచేస్తుంది. ప్రాథమిక హక్కులతోపాటు విధులను ప్రజలు మరువరాదు. రాజ్య విధాన ఆదేశిక సూత్రాలను పాలకులు తమ అధికార నిర్వహణకు, ఆస్తుల సంపాదనకు కాక ప్రజల సౌకర్యంకోసం అమలు చేయాలి.నేటి ప్రజాప్రతినిధులలో అత్యధికులు నేరస్తులే. మన పాలకులు విద్య, ఆరోగ్యాలను నిజీకరించారు. ప్రైవేటు సంస్థలకు ఇచ్చారు. నియమ నిబంధనలను గాలికొదిలి ప్రకృతి వనరులను, దేశ సపందను తమ ఆశ్రితులకు అతిచౌకగా అమ్మేస్తున్నారు. తస్మదీయ వాణిజ్యవేత్తలను బెదిరించివారి అధీనంలోని ప్రజాసౌకర్య వాణిజ్య వనరులను అస్మదీయులకు అప్పజెపుతున్నారు. అనేక రకాల అవినీతులను ప్రోత్సహిస్తున్నారు. ఎన్నికల్లో, ప్రజల, ప్రజాప్రతినిధుల కొనుగోళ్ళకు అక్రమంగా కోట్లాది నిధులు లాక్కుంటున్నారు. వారే ప్రత్యక్ష, పరోక్ష అత్యాచారాలకు, హత్యలకు, మతోన్మాద మానవ హననాలకు కారణమవుతున్నారు. ఓటర్లను కొనడం పాత పద్ధతి. ఈరోజు ప్రజాప్రతినిధులనే కొంటున్నారు. తమ పార్టీ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వాలను మారుస్తున్నారు. రాజ్యాంగ నిర్దేశిత లౌకికత్వానికి తూట్లు పొడుస్తున్నారు. మన ప్రథమ సేవకుడు ప్రధాని నెహ్రూ రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ నే సోమనాథ్ దేవాలయ పునఃప్రారంభ కార్యక్రమానికి హాజరుకావద్దని, లౌకిక దేశ అధ్యక్షునికి అది తగదని రాశారు. ప్రపంచ సర్వధర్మ (వైదికవాద) సమావేశాలకు వెళ్ళొద్దని రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఇద్దరికీ సలహాఇచ్చారు. రెండు సందర్భాలలో వారు మేము హాజరవుతామని భీష్మించారు. అప్పుడు మీరు రాజేంద్రప్రసాద్‌గా, రాధాకృష్ణన్‌గా వెళ్ళాలి. మీ ప్రాతినిధ్యానికి ఖజానా నుండి రూపాయి కూడా ఖర్చుపెట్టకూడదని ఆంక్షలు విధించారు. నేటి ప్రధాన సేవకుడు మోదీ పౌరోహిత్య అర్హత, సపత్ని సహచరి కాకపోయినా దేవాలయాల శంకుస్థాపనలు, ప్రారంభాలు హిందుత్వ విరుద్ధంగా చేస్తున్నారు. రామాలయ నిర్మాణసంస్థను నియమించమని ప్రభుత్వాన్ని ఆదేశించే అలౌకిక తీర్పుల స్థాయికి కోర్టులను దిగజార్చారు. సమానత, మత స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, జీవించే హక్కులను ఏకపక్ష నల్ల చట్టాలతో రద్దు చేస్తున్నారు. దేశ సమాఖ్య స్వభావాన్ని ధ్వంసం చేశారు. రాష్ట్రాల జాబితాలోని అంశాల్లో చట్టాలు చేస్తున్నారు. వ్యవసాయ, విద్యుత్తు వితరణ సవరణ చట్టాలు ఈ కోవలోవే.

స్టాన్ స్వామి జైలు చావును, 90శాతం వికలాంగుడు, ఆంగ్ల భాషాచార్యులు సాయిబాబా దశాబ్దాల బెయిలులేని జైలు జీవితాలను పట్టించుకోని నాయకులు అవినీతి ఆరోపణలపై తమ అరెస్టులు అన్యాయం అంటారు. రోగాలు అప్పుడే బయటపడతాయి. తమదే నిజం అంటారు. తమ మాట నెగ్గింపే ప్రజాస్వామ్య విజయమని యాగీ చేస్తారు. పార్టీ నాయకులను వదిలేసి కుటుంబసభ్యులే ప్రచారాలు చేస్తారు. వారసత్వ రాజకీయాలకు ఇది నాంది. అధికారులు సొంత కులస్తుల దగ్గర కూడా లంచాలు తీసుకోకుండా తమ విధులను నిర్వహించరు. చట్టాలను గౌరవించరు. పన్నులు ఎగ్గొడతారు. దేశ సమగ్రత, సమైక్యతలు పట్టవు. దేశ సంపద ఆక్రమణలో వారే విక్రములు. తమ కులస్తులకు, మతస్తులకు కూడా సాయం చేయరు. అలా చేసి ఉంటే మతాలయాల ముందు అడుక్కునేవారు ఉండేవారే కాదు. తమ రాజకీయ ప్రయోజనాలకోసం ప్రజలను కులమతాల ఆధారంగా విభజిస్తారు. అమాయక ప్రజలు ఈ ఉచ్చులోపడి స్వార్థ రాజకీయ రెచ్చగొట్టుళ్ళకు లొంగుతున్నారు. అప్రజాస్వామికంగా ప్రవర్తిస్తున్నారు. శాస్త్రీయ దృక్పథానికి పాలక, పాలిత వర్గాలు రెండూ తిలోదకాలిచ్చాయి. మత అసహనంతో ఇరువర్గాలకు పూనకం వస్తుంది. ఎక్కడా సౌభ్రాతృత్వం కనపడదు. ప్రతి చోటా మోసాలు, కుట్రలు, కుతంత్రాలే. నేటి పాలకులు ఆధిపత్య భావజాల ఆచార్యులు. అధికసంఖ్యాక మతస్తుల పక్షపాతులు. వైదికావాదులే సంఘ్ ప్రజలు. మతోన్మాద పెట్టుబడిదారి పాలకులకు బహుళజాతి సంస్థల యజమానులు, వాణిజ్యవేత్తలు, సంపన్నులు వస్తువులు. పేదలు, దళితులు, స్త్రీలు, వెనక్కు నెట్టబడిన కులాలవారు సరుకులు. మానవత్వం, మనిషితత్వం నిరాకరించిన జీవులు చైతన్యంతో ఆలోచించాలి.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి
సంచారవాణి: 9490 20 4545

కరువు మండలాలపై సవతితల్లి ప్రేమ

కె.వి.వి.ప్రసాద్

ఏడ్దు ఏడ్చిన వ్యవసాయం - రైతు ఏడ్చిన రాజ్యం నిలవదన్న చందంగా మన రాష్ట్రంలో వ్యవసాయంపై ప్రభుత్వం తీరు ఉన్నది. ప్రస్తుతం కరువు తీవ్ర రూపం దాల్చింది. అన్ని జిల్లాలు అత్యల్ప వర్షం కేటగిరిలో మగ్గుతున్నాయి. జూన్ 1 నుండి సెప్టెంబరు వరకు 574.7 మి.మీటర్ల వర్షపాంతం నమోదుకావల్సి ఉంటే 487.2 మి.మీటర్లు మాత్రమే కురిసింది. 15.2శాతం తక్కువ వర్షం పడింది. అక్టోబరు 1 నుండి నవంబరు 1 మధ్యకాలంలో 173.5 మి.మీటర్లు గత సంవత్సరకాలంలో కురవాల్సిఉంటే ప్రస్తుత సంవత్సరం ఈ కాలంలో 20.7 మి.మీటర్లు మాత్రమే అంటే 88.1శాతం అతితక్కువ వర్షపాతం నమోదైంది. 17 జిల్లాల్లో 20శాతం నుంచి 60శాతం వరకు తక్కువ నమోదుకాగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 61.6శాతం అతి తక్కువ వర్షపాతం నమోదైంది. మొత్తం ఖరీఫ్ సీజన్‌లో 29.8శాతం లోటు వర్షపాతం నమోదైంది. 18 జిల్లాల్లోని 440 మండలాల్లో తీవ్ర కరువు, దాదాపు 40 మండలాలకు పైగా తీవ్ర దుర్భిక్షం ఉన్నది. ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, వెలిగోడు, సోమశిల, కండలేరులలో గత సంవత్సరం అక్టోబరు 25 నాటికి 800.33 టియంసిల నీటి నిల్వలు ఉంటే ప్రస్తుతం 326.5 టియంసిలు మాత్రమే ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం యల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువ కురుస్తాయని వాతావరణ శాఖ, పర్యావరణ శాస్త్రవేత్తలు ముందుగా హెచ్చరికలు జారీచేశారు. ఈ సంవత్సరం ఆగస్టు నెలలో నమోదైన వర్షపాతం అత్యల్పం. 122 సంవత్సరాల క్రితం నమోదైనదానితో సమానం. 2023 సెప్టెంబరు మాసంలో కొద్దిపాటి వర్షాలు కురిసినా అక్టోబరులో తిరిగి ఉష్ణోగ్రతలు తీవ్రరూపం దాల్చాయి. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనాయి. అక్టోబరులో 89శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. రాయలసీమ వ్యాప్తంగా సాధారణంకంటే 90శాతం వర్షాలు తక్కువ పడ్డాయి. ముఖ్యమంత్రి సొంత జిల్లా వై.యస్.ఆర్. కడపలో 97శాతం తక్కువ నమోదైంది. కర్నూలు జిల్లాలో 99శాతం తక్కువ వర్షం కురిసింది. కోస్తా జిల్లాల్లో సైతం 88శాతం తక్కువ వర్షాలు నమోదైనాయి. తీవ్ర వర్షాభావంవల్ల భూగర్భ జలమట్టం పడిపోయి రాయలసీమ జిల్లాల్లో సగటు నీటిమట్టం 2.75 మీటర్లు తగ్గింది. కోస్తాంధ్ర జిల్లాలో సగటు 1.49 మీటర్లు, రాష్ట్ర సగటు నీటి మట్టం 1.88 మీటర్లు తగ్గిపోయింది.

తీవ్ర వర్షాభావం ప్రాజెక్టుల నీటిమట్టం, భూగర్భజల నీటిమట్టం తగ్గిపోవటంతో పంటలు ఎండిపోయి రైతాంగం దిగుబడులపై ఆశలు వదులుకున్నారు. మరోవైపు విద్యుత్ కోతలు రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లో సైతం సాగునీరందక వరి తదితర పైర్లు ఎండిపోవడం జరుగుతున్నది. ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 34.39 లక్షల హెక్టార్లు కాగా, సాగైంది 24.98 లక్షల హెక్టార్లు మాత్రమే. రబీ పంటకాలంలో సాధారణ సాగు 22.38 లక్షల ఎకరాల్లో జరగాలి. గత సంవత్సరం నవంబరు 1 వరకు 2.11 లక్షల హెక్టార్లలో సాగైతే ప్రస్తుతం 1.51 లక్షల హెక్టార్లలో మాత్రమే వివిధ పంటల సాగు జరిగింది. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ప్రభుత్వం జి.ఓ.యం.యస్. 4 ద్వారా అక్టోబరు 31న 103 కరువు మండలాలను ప్రకటించింది. యన్.టి.ఆర్. జిల్లా 2, కర్నూలు 24, నంద్యాల 6, అనంతపురం 28, శ్రీ సత్యసాయి 21, అన్నమయ్య 18, చిత్తూరు 4 మండలాలను మాత్రమే కరువుగా ప్రకటించింది. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో కరువు తీవ్రత అధికంగా ఉన్న మిగిలిన జిల్లాలను కరువుగా ప్రకటించకపోవడం దురదృష్టకరం. కేవలం వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకోకుండా ఖరీఫ్‌లో దాదాపు 25 లక్షల ఎకరాల్లో సాగు జరగని విషయాన్ని ప్రభుత్వం విస్మరించింది. కృష్ణా డెల్టాతోసహా వివిధ ప్రాజెక్టుల క్రింద సాగైన వరి పంటకు నీరు అందక నెర్రెలతో పంట భూములు దర్శనమిస్తున్నా, వేసిన పంటలు ఎండిపోతున్నా దిగుబడులు గణనీయంగా తగ్గుతాయని రైతుల ఆవేదన పాలక ప్రభుత్వానికి పట్టకపోవడం ఆశ్చర్యం. ఈ స్థితిలో ప్రస్తుతం కరువు మండలాల ప్రకటనపై ప్రభుత్వం పునఃసమీక్షచేసి కరువు మండలాలను ప్రకటించాలి. ప్రకటించిన కరువు మండలాలతోపాటు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో కరువు నివారణ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఖరీఫ్, రబీలో ఇప్పటి వరకు పంట వెయ్యలేకపోయిన రైతులను కూడా ఆదుకోవాలి. పంటవేసి నష్టపోయిన రైతాంగానికి ఆహార పంటలకు 25వేలు, వాణిజ్య పంటలకు 50వేలు, ఉద్యాన పంటలకు లక్ష రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి.

గ్రామీణ ప్రాంతాల్లో రైతుకూలీలు పెద్దఎత్తున వలసలు పోతున్నారు. వందలాది గ్రామాల్లో త్రాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వ్యవసాయ, ఉద్యాన, జలవనరుల, రెవిన్యూ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించి ప్రత్యామ్నాయచర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్న కనీస విజ్ఞత రాష్ట్ర ప్రభుత్వానికి కొరవడింది. తక్షణం రాష్ట్రంలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితుల నుండి రైతాంగాన్ని, గ్రామీణ పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వెంటనే రాజకీయ పక్షాలు, రైతుసంఘాలతో సమావేశం నిర్వహించి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించాలని, ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించి ఖరీఫ్‌లో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, రబీ పంట కాలానికి అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తక్షణం కరువు మండలాలపై పునఃసమీక్షచేసి తిరిగి ప్రకటించాలి. పంటల బీమా అమలు చేయాలి. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలుచేసి వలసల నివారణకు చర్యలు చేపట్టాలి. ఖరీఫ్ కాలంలో రైతులు, కౌలు రైతులు తీసుకున్న అన్ని రకాల అప్పులను రద్దుచేసి రబీపంట కాలానికి తిరిగి వడ్డీలేని రుణాలు ఇవ్వాలి, రబీలో పంటలు వేసే రైతాంగానికి 90శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలి. పశుగ్రాసం, దాణా ఉచితంగా అందించాలి. కరువు పెన్షన్లు ఇవ్వాలి.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి

బీజేపీపై 'అగ్నిపథ్ నిరసనాస్త్రం'

- 'పథకం' మేలుపై రాజస్తాన్‌లోని షెఖావతి ప్రాంత యువత మనోవేదన
- సైన్యంలో చేరాలన్న తమ కలను కేంద్రం కాలరాసిందని ఆగ్రహం
- అసెంబ్లీ ఎన్నికల వేళ కాషాయ పార్టీకి ఎదురుదెబ్బ

ఝుంఝును : రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీకి 'అగ్నిపథ్ నిరసనాస్త్రం' ఎదురుకానుంది. భారత సైన్యంలో సేవ చేయాలనే యువత కల నెరవేరకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. సైన్యంలో చేరి దేశ రక్షణకు అంకిత భావంతో పని చేయడంతో పాటు తమ జీవన ప్రమాణాలను సైతం మెరుగుపరచుకోవాలనే యువత ఆశలను ఆదిలోనే చిదిమేసింది. అగ్నిపథ్ వంటి అస్తవ్యస్త పథకం ఏమాత్రం యువతకు సరిపోదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ రాజస్థాన్‌లోని యువతలో ఈ పథకం విధివిధానాల పట్ల తీవ్ర నిరాశానిస్పృహలు నెలకొన్నాయి. రాజస్థాన్ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో ప్రత్యేకించి రాష్ట్రంలోని షెఖావతి ప్రాంతంలోని పెద్ద సంఖ్యలో యువత తమ ఆశలను అణచివేసుకుంటూ మరొక ఉపాధి కోసం వెతుకులాడుకుంటున్నారు. ఇది రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతో పాటు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ బీజేపీకి గట్టి ఎదురుదెబ్బేనని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అసలు ఈ పథకం పట్ల యువతలో ఆశలు ఎలా ఉన్నాయంటే, సైన్యంలో చేరాలనే కలతో తెల్లవారుజామున 3.30 గంటలకు నిద్రలేచి పరుగు కోసం బయటకు వెళ్లడం గత రెండేళ్లుగా దీపక్ మీల్‌కు దినచర్యగా మారింది. కానీ అతను నిరాశతో ఉన్నాడు. అందుకు కారణం సైనికుల నియామకం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన 'అగ్నిపథ్' పథకం. మీల్ మాదిరిగారు రాజస్థాన్‌లోని షెఖావతి ప్రాంతంలో సైనిక నియామకానికి సిద్ధం కావడానికి ప్రతిరోజూ వందలాది మంది యువకులు ప్రతి రోజూ ఇదే దినచర్యను అనుసరిస్తారు. వారంతా ఒకే బాధను ఎదుర్కొంటున్నారు. గత ఏడాది జూన్‌లో ప్రవేశపెట్టిన పథకం రాజకీయ చిక్కుల గురించి ఆశావహులు నోరు మెదపకపోయినప్పటికీ, నవంబరు 25న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో తిరిగి అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్న బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై స్థానికుల మధ్య చర్చలు స్పష్టంగా ఆగ్రహాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ పథకంలో ఎటువంటి ప్రతికూలత లేదని బీజేపీ నాయకులు పేర్కొంటుండగా, జాతీయంగా దాని ప్రధాన ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ మాత్రం ఈ పథకం ఏమాత్రం సరిగా లేదని ఆరోపిస్తోంది. చాలా మంది ఆశావహులు, మాజీ సైనికులు, ఇంకా సేవలందిస్తున్న వారు ఈ పథకం పట్ల సంతోషంగా లేరని ఆ పార్టీ పేర్కొంది. అగ్నిపథ్ సైనికులకు నాలుగు సంవత్సరాల సేవా పదవీకాలాన్ని అందిస్తుంది. వారిలో 25 శాతం మందిని తదుపరి సేవా కాలానికి ఎంపిక చేసుకునే సదుపాయం ఉంది. ఈ పథకం అధికారి స్థాయి కంటే తక్కువ నియామకం కోసం ఉద్దేశించింది. అనేక మంది ఔత్సాహికులు పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. వారు ఆర్మీ ర్యాలీలకు సిద్ధం కావడానికి కష్టపడి శిక్షణ తీసుకుంటున్నారు. కొందరు ఐదు-ఆరేళ్ల పాటు కూడా శిక్షణలో ఉన్నారు. కానీ కేవలం నాలుగు సంవత్సరాల సేవ కోసం ఇవన్నీ చేయడం న్యాయం కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'మేము ఉదయం 4 గంటలకు స్టేడియంలో పరుగెత్తడం ప్రారంభిస్తాము. దాని తర్వాత ఒకటిన్నర గంటల పాటు వ్యాయామం ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఆశించడానికి ఏమి మిగిలి ఉంది. ఇది ఇప్పటికే అగ్నిపథ్‌ను తీసుకువచ్చింది. మనలో కొందరు నాలుగు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు సిద్ధమవుతున్నారు. కేవలం నాలుగు సంవత్సరాల సర్వీస్ కాలాన్ని పొందుతారు. ఇది పూర్తిగా తప్పు' అని మీల్ స్థానిక స్టేడియంలో తన వ్యాయామ కార్యక్రమంలో ఉండగా పీటీఐకి చెప్పాడు. మరో ఔత్సాహికుడు రామ్ సింగ్ మాట్లాడుతూ తమ 'అభిరుచి' వల్లనే తమను రక్షణ దళాలకు సిద్ధం చేసి, నియామకానికి సరిపోయేలా చేస్తుందన్నారు. 'మేము చెమటోర్చి మా సర్వస్వాన్ని అందజేస్తున్నప్పుడు ప్రభుత్వం అగ్నిపథ్‌ని తీసుకువచ్చింది. ఇది చాలా మంది యువకులను సాయుధ దళాలలోకి రావడానికి వారు కన్న కలలకు అడ్డుకట్ట వేసింది' అని తెలిపాడు. ఇదిలాఉండగా, అనేక కోచింగ్ అకాడమీలు తమ యూనిట్లను మూసివేశాయని, వాటిని జిల్లా ప్రధాన కార్యాలయానికి మార్చడంతో శిక్షణ కోసం ఎంపికలు కూడా గ్రామాల్లో చాలా పరిమితంగా ఉన్నాయని సింగ్ చెప్పారు. 'సైనిక నియామకాన్ని మేము ఉద్యోగం లేదా సేవగా చూడము. మాకు ఇది ఒక కల. సైన్యంలో సేవ చేయడం గౌరవం. అమరవీరులను ఇంత గౌరవంగా దహనం చేయడం మేము చూశాము. ఇప్పుడు ఈ అగ్నిపథ్ పథకంతో పరిస్థితులు మారాయి' అని వికాస్ తాఖర్ అనే మరో ఔత్సాహికుడు అన్నాడు. 'ఒక అగ్నివీర్ (సైనికుడు) నాలుగు సంవత్సరాల సేవ తర్వాత ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, అతనికి అంత గౌరవం ఉండదు. అతను మరొక ఉద్యోగం వెతుక్కోవడం కూడా సవాలుగా ఎదుర్కొంటాడు' అని తెలిపాడు. ఝుంఝునులోని దాదాపు ప్రతి ఇంటికి మాజీ సైనికోద్యోగి లేదా సేవలో ఉన్న సిబ్బంది లేదా దేశ సరిహద్దులో పోరులో మరణించిన వారితో సంబంధాలు ఉన్నాయని తఖర్ వివరించాడు. కాగా, రాజస్థాన్‌లోని షెఖావతి ప్రాంతం ప్రధానంగా చురు, సికార్, జుంజును జిల్లాలను కలిగి ఉంది. ఈ ప్రాంతం ప్రజలలో రక్షణ సేవల పట్ల మక్కువకు ప్రసిద్ధి చెందింది. తెల్లవారుజామున క్రీడా మైదానాలు, పొలాలు, రోడ్లపై యువత పరిగెత్తడం ఇక్కడ సాధారణ దృశ్యం. ఏదేమైనప్పటికీ, ఒకప్పుడు శిక్షణా అకాడమీలతో విలసిల్లిన ప్రాంతం వాటిలో కొంత భాగం మాత్రమే మిగిలిపోయింది. ఏదేమైనప్పటికీ, ఒకప్పుడు శిక్షణా అకాడెమీలతో విలసిల్లిన ప్రాంతం వాటిలో కొంత భాగం మాత్రమే మిగిలిపోయింది. 'సైనిక నియామకానికి సిద్ధమవుతున్న యువకుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకురావడం ద్వారా ఎటువంటి మేలు చేయలేదు. రాబోయే ఎన్నికల్లో దీని ప్రభావం ఉంటుందని మేము ఆశిస్తున్నాము' అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఝుంజును అధ్యక్షుడు దినేష్ సుంద మాట్లాడుతూ మొత్తం షేఖావతి ప్రాంతంలో ఈ పథకం ప్రభావం ఎక్కువగా ఉందని, మాజీ సైనికులు ఈ పథకాన్ని వ్యతిరేకిస్తున్నారని, యువత కూడా అసంతృప్తితో ఉన్నారని, ఈ మోసానికి మోదీ ప్రభుత్వమే కారణమని అందరికీ తెలుసునని, ఎన్నికల్లో బీజేపీకి తగిన సమాధానం చెప్పడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అగ్నిపథ్ పథకంపై రానున్న రోజుల్లో ఝుంఝునులో మాజీ సైనికుల ర్యాలీ చేపడతామని ఆయన తెలిపారు. షెఖావతిలో అగ్నిపథ్ పథకం అనేది నిజంగానే కీలకమైన అంశం. ఈ అంశంపై బీజేపీ వేడిని ఎదుర్కోవాల్సి వస్తుందని పిలానీకి చెందిన మరో కాంగ్రెస్ నాయకుడు సురేంద్ర బెనివాల్ అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఇటీవల దౌసా, ఝుంజును జిల్లాలలో తన ర్యాలీలలో అగ్నిపథ్ పథకం కారణంగా యువతలో నిరాశ గురించి మాట్లాడారు. అయితే ఈ పథకం వల్ల ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని బీజేపీ నేత, సైనిక్ కళ్యాణ్ బోర్డు మాజీ చైర్మన్ ప్రేమ్ సింగ్ బజోర్ నొక్కి చెప్పారు. 'అగ్నిపథ్ పథకం గురించి ఎటువంటి ప్రతికూలత లేదు. యువత సంతోషంగా ఉన్నారు' అని నీమ్ కా థానా స్థానం (సికార్) నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బజోర్ అన్నారు.

దౌత్య పునర్జీవనానికి కొత్త విధానాలు తక్షణావసరం: జగదీప్ ధన్కర్

న్యూఢిల్లీ : మరింత ప్రభావవంతమైన సంఘర్షణ పరిష్కారం కోసం నిరోధాన్ని బలోపేతం చేయడానికి, దౌత్యాన్ని పునరుద్ధరించడానికి వినూత్న విధానాలను అన్వేషించడం తక్షణ అవసరమని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ శుక్రవారం తెలిపారు. ఇక్కడ చాణక్య డిఫెన్స్ డైలాగ్-2023లో ప్రసంగిస్తూ, బహుముఖ విధానం ద్వారా శాంతిని సాధించడం, సమర్థించడం, భావజాలం, న్యాయవాదం, చేరువకు, ఒప్పించడం, సంభాషణలను కలపడం, అలాగే అప్రమత్తంగా, సిద్ధంగా ఉండటం అతి ముఖ్యమైన ప్రాముఖ్యతను కూడా నొక్కి చెప్పారు. 'యుద్ధానికి సిద్ధంగా ఉండటం శాంతికి మార్గం అని అన్నారు. ఒక దేశం బలం అత్యంత ప్రభావవంతమైన రక్షణ, నిరోధకం అని తెలిపారు. భద్రతా వాతావరణాన్ని పెంపొందించడంలో దేశం మృదువైన శక్తిని, ఆర్థిక బలాన్ని సమగ్ర భాగాలుగా ఉపయోగించాల్సిన ప్రాముఖ్యతను కూడా ధన్‌కర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏఐ, రోబోటిక్స్, క్వాంటం, సెమీ-కండక్టర్స్, బయో-టెక్, డ్రోన్లు, హైపర్‌సోనిక్స్ వంటి లోతైన సాంకేతికతల ఆవిర్భావం యుద్ధం స్వభావాన్ని తిరగరాసిందని ఆయన అన్నారు. 'ఈ రంగాల పరాక్రమం, ప్రావీణ్యం భవిష్యత్‌లో వ్యూహాత్మకమైనవి, లేనివి నిర్ణయిస్తాయి' అని అన్నారు. ఉక్రెయిన్, పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభాలను ప్రస్తావిస్తూ, ప్రపంచీకరణ, ఆర్థిక పరస్పర ఆధారితాలు ఉన్నప్పటికీ, విభేదాలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక మిగులును కఠోర శక్తిగా మార్చడంలో దేశాల నైపుణ్యం ప్రాముఖ్యతను సంతరించుకుంటోందని, మరింత ప్రభావవంతమైన సంఘర్షణ పరిష్కారం కోసం నిరోధాన్ని బలోపేతం చేయడానికి, దౌత్యాన్ని పునరుద్ధరించడానికి వినూత్న విధానాలను అన్వేషించాల్సిన తక్షణ అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. జాతీయ భద్రత అనేది నేడు అనేక గుణాలు, సామర్థ్యాల సముదాయం. సైన్యం కేవలం ఒక భాగం మాత్రమే' అని స్పష్టం చేశారు. ప్రస్తుత వాతావరణానికి సరిపోయే పరిష్కారాలను కనుగొనడానికి బలమైన శక్తి గతిశీలతను రూపొందించడానికి విభిన్న భాగాలు కలిసి రావాల్సిన అవసరాన్ని ఉప రాష్ట్రపతి నొక్కి చెప్పారు.

తమిళనాడు మంత్రి ఆస్తులపై ఐటీ దాడులు



చెన్నై: తమిళనాడులోని అధికార డీఎంకే నాయకులు, మంత్రుల ఇళ్లపై జాతీయ దర్యాప్తు సంస్థల దాడులు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రజా పనులశాఖ మంత్రి ఈవీ వేలు ఇళ్లు, కార్యాలయాల్లో ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు సోదాలు చేస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి చెన్నై, తిరువళ్లూరు, తిరువన్నమలై, తిరుచ్చి, కరూర్ సహా 40కిపైగా ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. మంత్రి వేలుకు చెందిన అరుణై మెడికల్ కాలేజీ, అరుణై ఇంజినీరింగ్ కాలేజీ, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. పన్ను ఎగవేతకు సంబంధించి ఈ సోదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మంత్రి ఆస్తులతోపాటు ఆయన నిర్వహిస్తున్న మంత్రిత్వ శాఖ పరిధిలోని కాంట్రాక్టర్లపై ఐటీ అధికారులు దృష్టి సారించారు. ఇక ప్రముఖ రియల్ ఎస్టేట్ కార్యాలయాల్లో కూడా ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మంత్రి సెంథిల్ బాలాజీ, డీఎంకే ఎంపీ జగత్‌రక్షకన్ ఇళ్లు, కార్యాలయాల్లో కూడా అధికారులు సోదాలు చేసిన సంగతి విదితమే.

టాటూ ముసుగులో మత్తు పదార్థాల వినియోగం

తిరువనంతపురం: టాటూ స్టూడియో మాటున మత్తు పదార్థాలను విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. కేరళ రాజధాని తిరువనంతపురం నడిబొడ్డున తంపనూర్‌లో ఉన్న టాటూ స్టూడియోలో తనిఖీలు చేపట్టిన ఎక్సైజ్ సిబ్బంది 78.78 గ్రాముల సింథటిక్ డ్రగ్ ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. స్టూడియో యజమాని మజీంద్రన్ , అతని సహచరుడు షాన్ అజీని అదుపులోకి తీసుకుని... వారి నుంచి మత్తుపదార్థాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ వర్గాలు తెలిపాయి. నిందితులు టాటూ స్టూడియోను తమ మాదక ద్రవ్యాల వ్యాపారానికి కేంద్రంగా ఉపయోగిస్తున్నారని, యువకులు వారి ఉచ్చులో పడుతున్నారని ఎక్సైజ్ అధికారి తెలిపారు. 'ముందస్తు సమాచారం ఆధారంగా, మేము స్టూడియోపై దాడి చేశాం. అక్కడ నుండి 78.78 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నాము. మాకు అందిన సమాచారం మేరకు బెంగళూరు నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చారు' అని పేర్కొన్నారు. టాటూలు వేయించుకునేందుకు స్టూడియోకు వచ్చే వారినే నిందితులు లక్ష్యంగా చేసుకున్నారని అధికారి తెలిపారు. 'సాధారణంగా టాటూ ప్రక్రియను పూర్తి చేయడానికి కొంత సమయం పడుతుంది. టాటూ పూర్తయ్యే వరకు కస్టమర్‌లు ఎదురుచూస్తుండగా, నిందితులు వారికి డ్రగ్స్ గురించి తెలియజేసి వారిని ఆకర్షిస్తారు' అని ఆయన చెప్పారు. మజీంద్రన్ ఇక్కడి రాజాజీ నగర్‌కు చెందిన వ్యక్తి కాగా, అజీ స్వస్థలం పెరింగమల. నిందితులు కొంతకాలం క్రితం వరకు నగరంలో మరోచోట టాటూ పార్లర్‌ను నడిపారని, ఆ తర్వాత తంపనూర్‌కు మారారని అధికారి తెలిపారు. ఇక్కడ డ్రగ్స్ పట్టుబడిన నేపథ్యంలో ఇలాంటి వ్యాపారాలపై నిఘాను పటిష్ఠం చేస్తామని ఎక్సైజ్ వర్గాలు తెలిపాయి.

దిల్లీలో ప్రమాదస్థాయికి కాలుష్యం

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో మరోసారి కాలుష్య తీవ్రత ప్రమాదస్థాయికి చేరింది. శుక్రవారం తెల్లవారుజామున నగరంలోని చాలా ప్రాంతాల్లో గాలి నాణ్యత 'తీవ్రస్థాయి'కి చేరుకుంది. కేంద్ర కాలుష్య బోర్డు గణాంకాల ప్రకారం మొత్తంగా వాయునాణ్యత సూచీ 346గా నమోదైంది. లోధీ రోడ్, జహంగీర్‌పురి, ఆర్కేపురం, ఐజీఐ ఎయిర్ పోర్టు టీ3 వద్ద పొగమంచు తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లో వరుసగా 438, 491, 486, 463గా వాయు నాణ్యత నమోదైంది. లోధీ రోడ్డులో దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ నీటిని చల్లుతోంది. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలోని సెక్టార్ 62, సెక్టార్ 1, సెక్టార్ 116 వద్ద గాలి నాణ్యత పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అనవసరమైన నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. "శ్వాసకోశ సమస్యలతో ఇబ్బంది పడేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. చాలా మంది దగ్గు, జలుబు, కళ్ల నుంచి నీరు కారడం, కళ్లు మండటం వంటి సమస్యలతో బాధపడుతున్నారు" అని నిఖిల్ మోదీ అనే వైద్యుడు వెల్లడించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాజధానిలో ఐదు రోజుల పాటు నిర్మాణ పనులు చేపట్టకూడదని దిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ ఆదేశాలు జారీ చేశారు. వాహనాల నుంచి వచ్చే వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు నగరంలో రెడ్ సిగ్నల్ పడగానే వాహన ఇంజిన్ ఆపేసే కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతోపాటు 1,000 సీఎన్‌జీ ప్రైవేటు బస్సులను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

శ్రీకృష్ణుడి దయ ఉంటే...

ఎన్నికల్లో పోటీ చేస్తా: కంగన

ద్వారక: శ్రీకృష్ణుడు తనను ఆశీర్వదిస్తే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తానని బాలీవుడ్ నటి కంగనా రనౌత్ సూచనప్రాయంగా తెలిపారు. శుక్రవారం ఉదయం ఆమె శ్రీకృష్ణుడి ప్రసిద్ధ ద్వారకాదీష్ ఆలయంలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారా అని విలేకరులు ఆమెను అడగ్గా... 'శ్రీ కృష్ణ కీ కృపా రహీ తో లడేంగే (శ్రీకృష్ణుడు ఆశీర్వదిస్తే నేను పోరాడతాను)' అని రనౌత్ అన్నారు. 600 సంవత్సరాల పోరాటం తర్వాత బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను సాధ్యం చేసిందని ఆమె ప్రశంసించారు. 'బీజేపీ ప్రభుత్వ కృషితో 600 ఏళ్ల పోరాటం తర్వాత భారతీయులమైన మనం ఈ రోజును చూడగలుగుతున్నాం. ఘనంగా ఆలయాన్ని ఏర్పాటు చేసుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా సనాతన ధర్మ జెండా రెపరెపలాడాలి' అని ఆమె అన్నారు. సముద్రంలో మునిగిపోయిన ద్వారకా నగర ఆనవాళ్లను చూసేందుకు యాత్రికులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని రనౌత్ కోరారు. 'నేను ఎప్పుడూ ద్వారక ఒక దివ్య నగరం అని చెబుతాను. ఇక్కడ ప్రతిదీ అద్భుతంగా ఉంది. ప్రతి కణంలోనూ ద్వారకాధీశుడు ఉన్నాడు' అని రనౌత్ అన్నారు. 'నీటిలో మునిగిపోయిన ద్వారకా నగరం పై నుండి కూడా కనిపిస్తుంది. నీటి అడుగకు వెళ్లి అవశేషాలను చూసేంత సౌకర్యం ప్రభుత్వం కల్పించాలని కోరుకుంటున్నాను. నాకు కృష్ణుడి నగరం స్వర్గం లాంటిది' అని రనౌత్ తెలిపారు.

కాంగ్రెస్ ఎన్నికల హామీలపై చర్చకు సిద్ధమా?

వసుంధర రాజేకు అశోక్ గెహ్లాత్ సవాల్

జైపూర్: రాజస్తాన్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 7హామీలపై బహిరంగ చర్చకు రావాలని ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ బీజేపీకి సవాల్ విసిరారు. 'రాజస్తాన్ ఎన్నికల్లో కీలక అంశం కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న ఏడు హామీలు. దీనిపై నాతో చర్చకు రావాలని నేను ప్రతిపక్ష పార్టీ నాయకురాలు వసుంధర రాజేను సవాలు చేస్తున్నాను' అని గెహ్లాత్ 'ఎక్స్' వేదికగా సవాల్ చేశారు.

రాజస్తాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష బీజేపీ నాయకురాలు వసుంధర రాజే తీవ్రస్థాయిలో విమర్శించిన ఒక రోజు తర్వాత, ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ ఈ మేరకు స్పందించారు. గురువారం బాలి, బిలారా, పాలి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన రాజే... తనకే గ్యారంటీ లేని కాంగ్రెస్ ఇప్పుడు హామీలు ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. తప్పుడు వాగ్దానాలను నమ్మడానికి ప్రజలు మూర్ఖులు కాదని ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్ హయాం అంతా ప్రజలకు గాయాలు చేసింది.. ఇప్పుడు తన పాలన ముగిసే సమయానికి చేతులు దులుపుకుంటోంది, ఇది నాటకం తప్ప మరొకటి కాదు... ఇది ప్రహసనమని ప్రజలకు తెలుసు' అన్నారు. ఈ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఏ ఒక్కరికీ మేలు జరగలేదన్నారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ప్రతి విద్యార్థికి ఇంగ్లీషు మీడియం విద్య, కుటుంబ పెద్దలకు రూ. 10,000 వార్షిక గౌరవ వేతనం వంటి ఏడు హామీలను అశోక్ గెహ్లాత్ ప్రకటించారు. రాబోయే రాష్ట్ర ఎన్నికలకు ముందు తన ఏడు హామీల ప్రచారం కోసం రాజస్థాన్ కాంగ్రెస్ ఏడుగురు ఇన్‌చార్జిలను, ముగ్గురు సమన్వయకర్తలను నియమించింది. ఈ ఇన్‌చార్జిలు, సమన్వయకర్తలు 'కాంగ్రెస్ హామీ యాత్ర'లో భాగంగా ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ హామీలను వివరిస్తారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేయడానికి హరియాణా మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా సహా ఐదుగురు సీనియర్ నాయకులను ప్రత్యేక పరిశీలకులుగా నియమించింది. సీనియర్ నేతలు ముకుల్ వాస్నిక్, జితేంద్ర సింగ్, శక్తిసిన్హ్ గోహిల్, షకీల్ అహ్మద్ ఖాన్ ఎన్నికలకు ప్రత్యేక పరిశీలకులుగా ఉన్నారు. ఈ నియామకాలను కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఆమోదించారు. అశోక్ గెహ్లాత్ ఎన్నికలకు ముందు అనేక సంక్షేమ పథకాలను ప్రకటించారు. అది కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రూపులను పక్కనబెట్టి ఐక్యంగా ఎన్నికల్లో విజయం కోసం కృషి చేస్తున్నారు. మరోవైపు రాజస్థాన్‌లో విజయంపై బీజేపీ ధీమాగా ఉంది. ప్రధాని మోదీ నేతృత్వంలో రాష్ట్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని జోరుగా ప్రచారం సాగిస్తోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 100 సీట్లు గెలుచుకోగా, బీజేపీ 73 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. అయితే, రెండు పార్టీల ఓట్ల శాతంలో తేడా చాలా స్వల్పంగా ఉంది. కాంగ్రెస్‌కు 39.30% ఓట్లు రాగా, బీజేపీకి 38.8% ఓట్లు వచ్చాయి. 4% ఓట్లు, 6 సీట్లతో బీఎస్పీ మాత్రమే కొంత ఉనికిని కలిగి ఉంది.

ఎన్నికల ప్రచారానికి ఎంపీఎఫ్‌తో పార్టీల ఒప్పందం

మిజోరంలోని మామిత్ జిల్లా రాజకీయ సంప్రదాయం

మామిత్: మిజోరం అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు రోజులే ఉన్నా రాజకీయ పార్టీల భారీ పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లు పెద్దగా కనిపించడం లేదు. మిజో నేషనల్ ఫ్రంట్, కాంగ్రెస్, జోరం పీపుల్స్ మూవ్‌మెంట్, బీజేపీకు చెందిన చిన్న జెండాలు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మామిత్ జిల్లాలోని హచెక్, మామిత్, దంపా స్థానాల్లో ఈ పరిస్థితి ఉంది. ఎన్నికల ప్రచారాన్ని ఏ విధంగా సాగించాలనే దానిపై మిజోరం పీపుల్స్ ఫోరం (ఎంపీఎఫ్)తో అన్ని రాజకీయ పార్టీలు ఒప్పందం చేసుకున్నట్లు స్థానిక వ్యాపారవేత్త హెచ్.సియాంజామా తెలిపారు. ఉమ్మడి ప్రచార వేదికను ఈ ఫోరం నిర్ణయిస్తుందని చెప్పారు. కార్యక్రమం జరిగినప్పుడు అన్ని పార్టీల అభ్యర్థులు హాజరై ప్రసంగించాలని, ఆపై ప్రశ్నోత్తరాలు సాగుతాయని అన్నారు. మిజోరం పీపుల్స్ ఫోరం స్థానిక ప్యానల్ అనుమతి లేకుండా ఏ పార్టీ ఇంటింటి ప్రచారాన్ని కూడా నిర్వహించేందుకు వీల్లేదని చెప్పారు. ఇది ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయమని, ఎన్నికల ప్రచారానికి ఉండే ప్రత్యేకతని సియాంజామా అన్నారు. మిజోరం పీపుల్స్ ఫోరం మార్గదర్శకత్వంలో అన్ని పార్టీలు ప్రచారాన్ని సాగిస్తాయని, ఈ పద్ధతిని స్వాగతిస్తున్నామని స్థానిక బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు అన్నారు. ఎన్నికల వేళ అన్ని పార్టీలకు ఓటర్లను చేరుకునేందుకు సమాన అవకాశం లభిస్తుందని వారు చెప్పారు.

మితిమీరిన పోలీసుల ఆగడాలు

పది మంది మణిపూర్ ఎమ్మెల్యేల ఆగ్రహం

ఇంఫాల్: మణిపూర్‌లో సబ్ డివిజనల్ పోలీసు అధికారి హత్యకు గురైన తర్వాత నుంచి రాష్ట్ర పోలీసుల ప్రవర్తన మితిమీరిందని గిరిజన ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. టెంగ్‌నౌపాల్ జిల్లాలో ముఖ్యంగా మోరే పట్టణంలో ఖాకీలు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. విచక్షణారహితంగా కాల్పులకు తెగబడుతున్నారని, ప్రజల ఆస్తులను ధ్వంసం చేస్తూ లూటీలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టాయి. క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా కుకీ-జోమి-హ్మార్ వర్గాల పది మంది ఎమ్మెల్యేలు సంయుక్త ప్రకటనలో రాష్ట్ర పోలీసుల తీరును ఆక్షేపించారు. పోలీసుల దురాగతాలకు అదుపు లేకుండా పోయిందని, సామాన్యులు భయంతో పారిపోయే పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. తాజా పరిస్థితి పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని కోరారు. ఎమ్మెల్యేల ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తోసిపుచ్చారు. పౌరహక్కుల ఉల్లంఘనల నివారణ కోసం మోరేలో కేంద్ర-రాష్ట్ర దళాలు సంయుక్త ఆపరేషన్లు చేపట్టినట్లు తెలిపారు. మోరే ఎస్‌డీపీఓ ఛింగ్తమ్ ఆనంద్ అక్టోబరు 31న హత్యకు గురైన తర్వాత నుంచి రాష్ట్ర దళాలు ఆ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. దీంతో ఇష్టారీత్యా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరిహద్దు పట్టణం నుంచి రాష్ట్ర దళాలను ఉపసంహరించాలన్న డిమాండ్ కుకీ వర్గీయుల నుంచి బిగ్గరగా వినిపిస్తోంది. మోరేతో పాటు ఇతర గిరిజన ప్రాంతాల్లో మోహరించిన కమాండోలను ఉపసంహరించాలని గిరిజన ఎమ్మెల్యేలు కోరారు. ఇదిలావుంటే మయితే లీపున్ చీఫ్ ప్రమోద్ సింగ్ వాహనంపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. మొత్తం ఆరుసార్లు కాల్పులు జరిపారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని లాంగోల్ ప్రాంతంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. రాష్ట్రంలో అనిశ్చితికి కుకీ మిలిటెంట్లే కారణమని సింగ్ అనేకసార్లు ఆరోపించారు. అయితే తాజా ఘటనలో ఆయనకు గాయాలు కాలేదని అధికారి తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. మే నుంచి ఈశాన్య రాష్ట్రంలో ఘర్షణలు జరుగుతూనే ఉండటం విదితమే.

అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు

కర్నాటక ప్రభుత్వ పరిశీలన

బెంగళూరు: మరణానంతరం తమ అవయవాలను దానం చేసే వ్యక్తులకు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించే అంశాన్ని కర్నాటక ప్రభుత్వం పరిశీలిస్తోందని ఆ రాష్ట్ర ఆరోగ్య మంత్రి దినేష్ గుండూరావు శుక్రవారం తెలిపారు.

ఇలాంటి ఉదాత్త కార్యక్రమాల్లో ఎక్కువ మంది పాల్గొనేలా ప్రోత్సహించే లక్ష్యంతో అవయవ దానం ప్రాముఖ్యతను ప్రచారం చేసేందుకు ప్రభుత్వం త్వరలో ఒక విధానాన్ని రూపొందిస్తుందని చెప్పారు.

ఒక అవయవ దాత ఎనిమిది మంది ప్రాణాలను రక్షించగలడని మంత్రి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. 'జీవితాలను బహుమతిగా ఇచ్చే ఈ ఉదాత్త చర్య అత్యంత ప్రశంసనార్హమైనదిగా మేము విశ్వసిస్తున్నాం. మరణం తర్వాత వారి అవయవాలను దానం చేసే వ్యక్తులను గుర్తించి, గౌరవించే కార్యక్రమాన్ని మా ప్రభుత్వం పరిశీలిస్తోంది' అని ఆయన చెప్పారు. సర్టిఫికెట్లు అందజేయడం, అవయవ దాతల అంత్యక్రియలను పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించడం వంటి ఆలోచనలను ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి వివరించారు. 'అవయవ దానం యొక్క ప్రాముఖ్యతను ప్రచారం చేయడానికి మేము త్వరలో ఒక విధానాన్ని రూపొందిస్తాము, ఇది మరింత మంది పాల్గొనేలా ప్రోత్సహిస్తుంది'అని పేర్కొన్నారు.

కరువు సీమను కాటేస్తున్న కేంద్రం

- కృష్ణా జలాల కోసం ఐక్య పోరాటం
- 14, 15 తేదీలలో విజయవాడలో నిరసన దీక్షలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-మార్కాపురం: రాజకీయ లబ్ధి కోసమే కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఇదే అమలైతే ఆంధ్రప్రదేశ్ ఎడారిగా మారుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. కేంద్రం గెజిట్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించాలని రామకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. కృష్ణా జలాల పంపిణీపై కేంద్రం కుట్ర-సాగునీటి ప్రాజెక్టుల భవిష్యత్తు అంశంపై సీపీఐ అధ్వర్యంలో జిల్లాస్థాయి సదస్సు స్థానిక పూల సుబ్బయ్య శాంతిభవన్‌లో శుక్రవారం జరిగింది. సీపీఐ మార్కాపురం నియోజకవర్గ కార్యదర్శి నాసరయ్య అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ నిత్యం కరువు కాటకాలతో సతమతమవుతున్న పశ్చిమ ప్రకాశానికి ఆశాజ్యోతి అయిన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారబోతుందని ఆందోళన వెలిబుచ్చారు. పశ్చిమ ప్రకాశానికి కృష్ణా జలాలు కాస్త ఆలస్యంగానైనా అందుతాయని ఈ ప్రాంత ప్రజలు ఆశించారని, అయితే తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి కోసం మోదీ ప్రభుత్వం కృష్ణా జలాల పున:పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, దీనివల్ల కృష్ణా జలాలు మనకు అందే పరిస్థితి లేదని విమర్శించారు. కేంద్రం నిర్ణయం వల్ల వెలుగొండ ప్రాజెక్టు మాత్రమే కాకుండా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ, నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతమంతా బీడు భూములుగా మారతాయని చెప్పారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 811 టీఎంసీల కృష్ణా జలాలు కేటాయించగా, రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల నీటిని కేటాయించారని గుర్తుచేశారు. అయితే తమకు కేటాయించిన నీటి కన్నా తెలంగాణ ఇప్పటికే ఎక్కువగా వినియోగించుకుంటుందని విమర్శించారు. కర్నాటక సైతం ఇష్టానుసారం కృష్ణా జలాలు వాడుకుంటుందన్నారు. కర్నాటక ఎన్నికల వేళ తుంగభద్రపై అనుమతి లేని ఎగువభద్ర ప్రాజెక్టును తెరపైకి తీసుకొచ్చిన మోదీ సర్కారు ఆఘమేఘాలపై రూ.5,300 కోట్లు కేటాయించిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీలో ఉన్న సమయంలోనే కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినా కేంద్రం గురించి ఒక్క మాట మాట్లాడలేదన్నారు. గెజిట్ నోటిఫికేషన్ వల్ల రాయలసీమతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలు శాశ్వతంగా ఎడారిగా మారతాయని చెప్పారు. కృష్ణా జలాలపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అధ్వర్యంలో ఈనెల 14 ,15 తేదీలలో విజయవాడలో నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు రామకృష్ణ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.తులసిరెడ్డి మాట్లాడుతూ మోదీ మోసపూరిత విధానాలు, సీఎం జగన్ అసమర్థ పాలన ఫలితంగా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. నాగావళి, కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార తదితర నదులపై నిర్మిస్తున్న ఏ ఒక్క ప్రాజెక్టును జగన్ పూర్తి చేయలేకపోయారన్నారు. ప్రధానంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు ఏమాత్రం ముందుకు సాగడం లేదన్నారు. జాతీయ ప్రాజెక్టు పోలవరానికి మోదీ సర్కారు సకాలంలో నిధులు కేటాయించకుండా కాలక్షేపం చేస్తున్నదని ఆరోపించారు. ఇంతజరుగుతున్నా ముఖ్యమంత్రి ఏనాడు మోదీని ప్రశ్నించే ధైర్యం చేయడం లేదన్నారు. కర్నాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519 మీటర్ల నుంచి 524 మీటర్లకు పెంచుతోందని, దీనివల్ల అదనంగా 130 టీఎంసీల నీటిని అదనంగా ఆ ప్రాజెక్టులో నిల్వ చేసుకుంటుందని, ఫలితంగా మన రాష్ట్రానికి తీవ్ర అన్యాయం, ప్రమాదం జరగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. నికర, మిగులు జలాల కోసం పెద్దఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల రంగ నిపుణులు బి.దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో అంతర్భాగంగా ఉన్న ప్రకాశం అనాదిగా కరువుతో తల్లడిల్లి పోతోందన్నారు. నదుల్లోని నీటిని వడిసిపట్టుకోకపోవడంతో అదంతా సముద్రంలోకి పోతుందని అన్నారు. కృష్ణా జలాల కోసం పెద్ద ఎత్తున ఉద్యమించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, రైతు సంఘం నాయకులు ఓబుల్ రెడ్డి, మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత కందుల గౌతమ్ రెడ్డి మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్, రైతు సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఎస్‌కే సైదా, కాంగ్రెస్ నాయకుడు జావీద్ అన్వర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ-బీహెచ్‌యూలో భద్రత కట్టుదిట్టం

వారణాసి: విద్యార్థిని వేధించిన ఘటన తర్వాత ఐఐటీ-బీహెచ్‌యూ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక పోలీసు అధికారిని అక్కడ నుంచి తొలగించారు. విద్యా సంస్థకు చెందిన హాస్టల్ సమీపంలో ఒక విద్యార్థిని వేధింపులకు గురి చేసి, దుస్తులు విప్పించినట్లు ఆరోపణలు రావడంతో వందలాది మంది విద్యార్థుల నిరసన తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. ఐఐటీ-బీహెచ్‌యూ గేట్ల వద్ద మోహరించిన సెక్యూరిటీ గార్డులు శుక్రవారం క్యాంపస్‌లోకి ప్రవేశించే వారిపై కఠినంగా తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదు. భేలుపూర్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ (ఏసీపీ) ప్రవీణ్ కుమార్ సింగ్... లంక పోలీస్ స్టేషన్‌లోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) అశ్విని పాండేని విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసినందుకు తొలగించినట్లు ధ్రువీకరించారు. 'బనారస్ హిందూ విశ్వవిద్యాలయం అధికారులతో సమావేశం నిర్వహించారు. బయటి వ్యక్తుల ప్రవేశాన్ని నిరోధించడానికి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు విశ్వవిద్యాలయం ఆవరణ అంతటా కొన్ని ప్రదేశాలలో అలాగే, నాలుగు ప్రధాన గేట్ల వద్ద కానిస్టేబుళ్లను మోహరించాలని నిర్ణయించాం' అని సింగ్ చెప్పారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయం ఆవరణలో భద్రతా ఏర్పాట్లను వర్సిటీ యంత్రాంగం నియమించిన గార్డులు చూసుకుంటున్నారని ఏసీపీ తెలిపారు. అయితే, విశ్వవిద్యాలయం లోపల అనేక చోట్ల అదనపు పోలీసు బలగాలను మోహరించారు. ఈ విద్యాసంస్థకు చెందిన విద్యార్థినిని వేధించిన నిందితులను గుర్తించి అరెస్టు చేసేందుకు పోలీసులు అనేక బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసు బృందాలు క్యాంపస్, సమీప ప్రాంతాలలోని కెమెరాల సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నాయి. దాడి చేసిన వారిని ట్రాక్ చేయడానికి మొబైల్ నిఘాను కూడా ఉపయోగిస్తున్నాయి. ఇదిలాఉండగా, ఐఐటీ- బీహెచ్‌యూ రాజ్‌పుతానా హాస్టల్ దగ్గర గుమిగూడిన విద్యార్థులు సంఘటనను నిరసిస్తూ గురువారం అర్థరాత్రి చేపట్టిన తమ ఆందోళనను విరమించారు. ఈ ఘటనలో బయటి వ్యక్తుల ప్రమేయం ఉందని, ఆవరణలోకి బయటి వ్యక్తులు రాకుండా నిషేధించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది బీహెచ్‌యూ విద్యార్థులు గురువారం నిరసన చేపట్టారు. నిరసనలో పాల్గొన్న ఒక విద్యార్థి మాట్లాడుతూ విద్యా సంస్థ డైరెక్టర్, పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం తరువాత మా భద్రత, సంఘటనలో పాల్గొన్న వారిపై సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన తర్వాత మేము నిరసనను విరమించాం' అని తెలిపారు. ఈ క్యాంపస్‌లో తరగతులు యథావిధిగా ప్రారంభమయ్యాయని, విద్యార్థులు హాజరవుతున్నారని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి ఈ వేధింపులు చోటుచేసుకున్నాయి. మహిళ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, ఆమె తన స్నేహితుడితో కలిసి తన హాస్టల్ నుంచి బయటకు వెళ్లినప్పుడు మోటార్ సైకిల్‌పై ముగ్గురు వ్యక్తులు ఆమెను బలవంతంగా ఒక మూలకు తీసుకువెళ్లి కర్మన్ బాబా దేవాలయం సమీపంలో తన స్నేహితుడి నుండి వేరు చేసిన తర్వాత ఆమె నోరు మూయించారు. ఆ తర్వాత నిందితులు మహిళను బట్టలు విప్పి వీడియో తీసి ఫొటోలు దిగారు. వారు 15 నిమిషాల తర్వాత ఆమె ఫోన్ నంబర్ తీసుకుని వదిలేశారని ఫిర్యాదులో పేర్కొంది. మహిళ ఫిర్యాదు ఆధారంగా లంక పోలీస్ స్టేషన్‌లో భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) లోని సెక్షన్ 354 (మహిళపై దాడి లేదా వేధింపులు), ఐటీ చట్టంలోని నిబంధనల ప్రకారం కేసు నమోదయిందని పోలీసులు చెప్పారు. సంఘటన తర్వాత ఐఐటీ-బీహెచ్‌యూ రిజిస్ట్రార్ రాజన్ శ్రీవాస్తవ... సంస్థలోని ఉద్యోగులు, విద్యార్థులందరికీ సురక్షితమైన వాతావరణాన్ని నిర్ధారించ డానికి క్యాంపస్ ప్రాంగణం చుట్టూ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఉంచాలని అన్ని బారికేడ్లను ఆదేశాలు జారీ చేశారు. నైట్ డ్యూటీలో ఉన్న సెక్యూరిటీ గార్డు బీహెచ్‌యూ స్టిక్కర్లు ఉన్న వాహనాలను, బీహెచ్‌యూ గుర్తింపు కార్డులు ఉన్న వ్యక్తులను మాత్రమే ప్రాంగణంలోకి అనుమతిస్తారని ఆయన చెప్పారు.

సుప్రీంను వాయిదాల కోర్టుగా మార్చవద్దు

న్యాయవాదులతో సీజేఐ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ : న్యాయవాదులు కేసులను తరచుగా వాయిదా వేయవద్దని, సుప్రీం కోర్టును 'తారీక్ పే తారీక్' (తేదీ తర్వాత తేదీ) కోర్టుగా మార్చవద్దని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ కోరారు. ప్రత్యేకించి తాజా కేసుల విచారణకు షెడ్యూల్ చేయబడిన ఇతర రోజులలో న్యాయవాదులు వాయిదాలు కోరుతూ ముందస్తు లేఖలు పంపడంపై సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో వాయిదాల కోసం న్యాయవాదులు 3,688 లేఖలను పంపారని తెలిపారు. కేసుల అత్యవసర జాబితా కోసం న్యాయవాదులు కోరుతున్నప్పుడు, వారు అత్యవసరాన్ని రద్దు చేస్తూ వాయిదా కోసం ఒక లేఖను పంపిణీ చేస్తారని ఉన్నత న్యాయమూర్తి పేర్కొన్నారు. 'సెప్టెంబరు 203 నుంచి ముందస్తు విచారణ కోసం 2,361 విషయాలు ప్రస్తావించ బడ్డాయి. ప్రతిరోజూ సగటున 59 విషయాలు ప్రస్తావనకు వస్తున్నాయి. ఒక వైపు విషయాలను త్వరిత ప్రాతిపదికన జాబితా చేస్తారు. మరోవైపు, వాటిని ప్రస్తావించారు. ఆపై, అవి జాబితా అవుతాయి. వాయిదా వేయడం జరుగుతుంది' అని పేర్కొన్నారు. ఈ వాయిదా లేఖలను పంపిణీ చేసే పద్ధతిని నివారించాలని న్యాయవాదులను కోరిన సీజేఐ... వాయిదాలు ఎందుకు కోరుతున్నారని సుప్రీం కోర్టు అడగనప్పటికీ, ఈ ఎంపికను దుర్వినియోగం చేయవద్దని న్యాయవాదులకు ఆయన సూచించారు. కేసు దాఖలు, విచారణ మధ్య తీసుకునే సమయాన్ని తగ్గించేందుకు కోర్టు కసరత్తు చేస్తోందని సీజేఐ తెలిపారు. నవంబరు 3న నమోదయిన కేసులకు సంబంధించి 154 వాయిదా పత్రాలు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ (ఎన్‌జేడీజీ) ప్రకారం 79,540 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 79,540 కేసులలో దాదాపు 25 వేల కేసులు ఒక సంవత్సరం కంటే తక్కువ. 2023లో సుప్రీం కోర్టులో 45 వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. వాటిలో 4,918 సెప్టెంబరు 2023లో నమోదవగా, సెప్టెంబరులో 4,300కి పైగా కేసులు పరిష్కారమయ్యాయి.

వాడని ఫోన్ నంబర్

మూడు నెలల తర్వాతే మరొకరికి

న్యూఢిల్లీ: డీయాక్టివేట్, రద్దు చేసుకున్న మొబైల్ నంబర్లను కనీసం 90 రోజుల తర్వాతే వేరొకరికి కేటాయిస్తామని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ సుప్రీంకోర్టుకు తెలిపింది. వ్యక్తుల డేటా గోప్యతను దృష్టిలో పెట్టుకుని కొత్త వ్యక్తులకు నంబర్‌ను కేటాయించే విషయంలో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపింది. రద్దైన, డీయాక్టివేట్ అయిన నంబర్ల విషయంలో సుప్రీంకోర్టులో దాఖలైన ఒక పిటిషన్‌పై ఈ మేరకు సమాధానం ఇచ్చింది. చాలా మంది తమ ఫోన్ నంబర్లను వినియోగించకుండా వదిలేస్తుంటారు. దీంతో అవి కొన్నాళ్లకు డీయాక్టివేట్ అయిపోతాయి. మరి కొందరు ఎక్కువ నంబర్లు ఉన్నప్పుడు నంబర్లను రద్దు చేసుకుంటూ ఉంటారు. ఇలా రద్దైన నంబర్లు కొన్నాళ్ల తర్వాత వేరొకరికి కేటాయిస్తారు. ఇలా చేయడం వల్ల ఆ నంబర్ వాడిన వ్యక్తి డేటా దుర్వినియోగానికి గురయ్యే అవకాశం ఉందంటూ 2021లో సుప్రీంకోర్టులో ఒక రిట్ పిటిషన్ దాఖలైంది. వాట్సప్ అకౌంట్ ఇన్ఫర్మేషన్ సహా వ్యక్తుల పర్సనల్ డేటా ప్రమాదంలో పడే అవకాశం ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. ఫోన్ నంబర్ల రీసైక్లింగ్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. దీనిపై ట్రాయ్ తన స్పందనను తెలిపింది. మునుపటి చందాదారుడి గోప్యతకు భంగం వాటిల్లకుండా ఉండేందుకే 90 రోజుల వ్యవధిని పాటిస్తున్నామని ట్రాయ్ తెలిపింది. సబ్‌స్క్రైబర్లు సైతం తమ వంతుగా వ్యక్తిగత సమాచారానికి సంబంధించి చర్యలు తీసుకోవాలని సూచించింది. వాట్సప్ సైతం తన స్పందనను కోర్టుకు తెలియజేసింది.

బీజేపీకి ఈడీ, సీబీఐ, ఐటీ 'ప్రచారకులు'... 'ఫ్రంట్ లైన్ యోధులు'

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ బీజేపీకి 'ప్రచారకులు'చ 'ఫ్రంట్‌లైన్ యోధులు'' అని కాంగ్రెస్ శుక్రవారం ఆరోపించింది. వారు ప్రతిపక్ష నాయకులను భయపెట్టి అధికార పార్టీలో చేర్చుకోవడానికి 'లక్ష్యాలు' నిర్దేశించారు. చిట్ ఫండ్ కేసును పరిష్కరించేందుకు రూ. 15 లక్షలు లంచం తీసుకున్నందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారిని, అతని సహచరుడిని రాజస్థాన్ అవినీతి నిరోధక బ్యూరో అరెస్టు చేసిన ఒక రోజు తర్వాత మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీ విమర్శల దాడి చేసింది. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధినేత పవన్ ఖేరా మాట్లాడుతూ అవినీతిని అరికట్టాల్సిన బాధ్యత ఉన్న అధికారులే లంచాలు తీసుకుంటున్నారని అన్నారు. 'రాజస్థాన్‌లో చిట్ ఫండ్ కేసును మూసివేయడానికి ఇద్దరు ఈడీ అధికారులు 15 లక్షల రూపాయల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు' అని ఖేరా చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రేట్ల జాబితాను మోదీ ప్రభుత్వం బహిరంగపరచాలి. చిన్న స్థాయి అధికారుల రేటు జాబితా రూ.15 లక్షలు అయితే.. అంతకంటే పై అధికారుల రేటు ఎంత అని ఖేరా ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలన్నీ బీజేపీ ప్రభుత్వ ప్రచారకులేనని ఆరోపించారు. 'విపక్ష నేతలను భయపెట్టి బీజేపీలో చేర్చుకునేందుకు వారికి లక్ష్యాలు పెట్టారు. ఇది (ప్రధాని నరేంద్ర మోదీ) మోదీ జీ టూల్‌కిట్' అని ఆరోపించారు. దేశంలోని దర్యాప్తు సంస్థలు శక్తివంతంగా, నిర్భయంగా ఉండాలని కాంగ్రెస్ కోరుకుంటోందని ఖేరా నొక్కి చెప్పారు. 'నాయకులు ప్రతిపక్షంలో ఉన్నంత కాలం అవినీతిపరులే.. కానీ బీజేపీలో చేరిన వెంటనే క్లీన్ అయిపోతారు. మీరు ఈ ఈ సంస్థలను బలోపేతం చేయాలని, వారిని నిస్సహాయులుగా చేయవద్దని మేము మోదీ ప్రభుత్వానికి చెప్పాలనుకుంటున్నాము' అని ఆయన అన్నారు. అవినీతి నిరోధక శాఖ తన పనిని నిర్భయంగా చేస్తూనే రాజస్థాన్‌లో ఈడీ అధికారులు లంచాలు తీసుకుంటుండగా పట్టుకున్నారని, బీజేపీ ప్రభుత్వం నిష్పక్షపాత సంస్థలను తుంగలో తొక్కిస్తోందని ఆరోపించారు. ఇది దేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన ముప్పు అని ఖేరా నొక్కి చెప్పారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లో తమ 'ఫ్రంట్‌లైన్ యోధులను' నాయకులను బెదిరించేందుకు, భయపెట్టేందుకు పంపుతున్నారని ఆరోపించారు. రాజస్థాన్ ఏసీబీ అరెస్టు చేసిన వారిలో దర్యాప్తు సంస్థ అయిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, జైపూర్ జిల్లాలోని విమల్‌పురా నివాసి నావల్ కిషోర్ మీనా, కొత్తగా ఏర్పడిన కోట్‌పుట్లి-బెహ్రోర్ జిల్లాలోని ముండావర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ బాబూలాల్ మీనా ఉన్నారు. రాజస్థాన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, నావల్ కిషోర్‌ను సస్పెండ్ చేసినట్లు, అతనితో పాటు ఇతర నిందితులపై మనీలాండరింగ్ దర్యాప్తు ప్రారంభించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతిపక్ష నేతలపై ఈడీ చర్య 'రాజకీయ ప్రేరేపితమైనది' అని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారానికి

ఐక్యపోరాటాలు అవశ్యం

లాభదాయకంగా లేని సేద్యం - ఏటేటా పెరుగుతున్న కూలీలు

బీకేయూ జాతీయ మహాసభలో రావుల వెంకయ్య

పాట్నా: దేశంలో సేద్యం లాభదాయకంగా లేదని, ఏటేటా వ్యవసాయ కూలీల సంఖ్య పెరుగుతోందని, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారానికి పరస్పర సహకారంతో ఐక్య ఉద్యమాలు అవసరమని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షులు రావుల వెంకయ్య అన్నారు. వివాదాస్పద సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటం సాగిన స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. భారతీయ వ్యవసాయ రంగంలో రైతులతో పాటు వ్యవసాయ కూలీల పరిస్థితి దీనంగా ఉందన్నదే నేటి వాస్తవమని నొక్కిచెప్పారు. రైతులు లేకుండా వ్యవసాయ కూలీలు... వ్యవసాయ కూలీలు లేకుండా రైతులు మనుగడ సాగించలేరని తెలిపారు.

నిన్నటి రైతులే నేటి వ్యవసాయ కూలీలు కాబట్టి వీరి పరిస్థితిల్లో పెద్దగా తేడా లేదన్నారు. ఒకప్పుడు సొంత భూముల్లో సాగు చేసే రైతన్నలు ఇప్పుడు కూలీలుగా మారుతుండటం ఆందోళనకరమని, రేపు కూలీలు మరింత పెరిగి సాగుదారుల సంఖ్య క్షీణించే అవకాశం లేకపోలేదన్నారు. మెరుగైన జీవనోపాధి, జీవితం కోసం ఉమ్మడి పోరాటాలు అనివార్యమని రావుల వెంకయ్య సూచించారు. బీహార్ రాజధాని పాట్నాలో జరిగిన భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేయూ) 15వ జాతీయ మహాసభ సందర్భంగా నిర్వహించిన ప్రతినిధుల సభలో ఆయన సౌహార్ద్ర సందేశమిచ్చారు. రైతులకు ఉన్నట్లే వ్యవసాయ కూలీలకు డిమాండ్లు ఉన్నాయని, ఆ డిమాండ్ల పరిష్కారానికి వేర్వేరుగా ఉద్యమాలు అవసరమని, పరస్పర సహకారంలో వాటిని విజయవంతం చేయొచ్చని రావుల వెంకయ్య అన్నారు. సాగు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రక రైతాంగ పోరాటమే స్ఫూర్తిగా ఉద్యమ కార్యచరణ ఉండాలని, ఉమ్మడి సమస్యలపై రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యపోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యానికి ముప్పు పొంచివున్న వేళ ఈ మహాసభలు జరుగుతున్నాయి కాబట్టి వ్యవసాయ రంగ కార్మికుల ఉద్యమాల బలోపేతానికి, పటిష్ఠ కార్యాచరణ ఈ సందర్భంగా రూపు దిద్దుకుంటుందని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. 2015-16 వ్యవసాయ గణన ప్రకారం సగటు రైతు వద్ద 1.08 హెక్టార్ల భూమి ఉండేదని, 31.86శాతం రైతాంగం వద్ద 0.01 నుంచి 0.4 హెక్టార్లు ఉండేదని అన్నారు. చిన్న భూములను నమ్ముకొని బతకలేక, కుటుంబ పోషణ కోసం చాలా మంది ఉపాధి అవకాశాలు వెతుక్కోవడం మొదలు పెట్టారని, గ్రామాల్లో ఉపాధి అవకాశాలు లేక వ్యవసాయ కూలీలుగా మారారని రావుల వెంకయ్య తెలిపారు. సొంత భూములు ఉన్నా ఇతరుల పొలాల్లో పనివారయ్యారన్నారు. దీంతో ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం సాగుదారులు తగ్గి కూలీలు పెరిగారని తెలిపారు. ఒకప్పుడు రైతుల సంఖ్య వ్యవసాయ కూలీల కంటే ఎక్కువ కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. 1951లో సాగుదారులు 69.9శాతంగా ఉంటే వ్యవసాయ కూలీలు 29.1శాతం మంది ఉండేవారుని, 2011 నాటికి వ్యవసాయ కూలీలు 54.9శాతానికి పెరుగగా సాగుదారులు 45.1శాతానికి తగ్గారని వెంకయ్య వెల్లడించారు. ఈ లెక్కన్న నిన్నటి రైతులే నేడు కూలీలు అయ్యారని స్పష్టమవుతోందని చెప్పారు. సగటు రైతుకు, వ్యవసాయ కూలీకి మధ్య ఆర్థిక స్థితిలోనూ తేడా లేదన్నారు. 2011-12లో రైతు నెలసరి ఆదాయం సగటున రూ.6,483 (దల్వాయి కమిటీ 2018 జనవరిలో పార్లమెంటుకు సమర్పించిన నివేదిక ప్రకారం). అంటే రోజుకు రూ.216 అని అన్నారు. అదే సమయంలో దేశం లోని క్లిష్ట పరిస్థితిని ప్రస్తావించారు. మతోన్మాద ఫాసిస్టు శక్తులు దేశాన్ని పాలిస్తుండటంతో ప్రజలను కుల-మతాలాధారంగా విభజిస్తూ, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. స్వయంప్రతిపత్తిగల సంస్థలను నిర్వీర్యం చేస్తున్నా రని, దర్యాప్తు సంస్థలను ఇష్టమొచ్చినట్లు వాడుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మైనారిటీలు, దళితులు, కార్మికులపై దాడులు, పోరాడి సాధించుకున్న హక్కుల హరణ తదితర అంశాలను ప్రస్తావిస్తూ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితులన్నింటి దృష్ట్యా సమస్యల పరిష్కారాకి సరైన ఉద్యమ కార్యచరణ రూపకల్పన ఎంతైనా అవసరమని రావుల వెంకయ్య సూచించారు.

రాజ్యసభ చైర్మన్‌కు క్షమాపణ చెప్పండి

ఆప్ ఎంపీ చద్దాకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దాకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యసభ నుంచి తనను సస్పెండ్ చేస్తూ చైర్మన్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ చద్దా సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపి తీర్పునిచ్చింది. చద్దా క్షమాపణలను రాజ్యసభ చైర్మన్ సానుభూతితో పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం సూచించింది. సస్పెన్షన్ కేసులో చద్దా నేరుగా చైర్మన్‌ను కలిసి క్షమాపణలు చెప్పాలని ఆదేశించింది. ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా తొలిసారి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఆయన అత్యంత పిన్న వయస్కుడన్న విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. కోర్టు ఆదేశాలపై చద్దా తరపు న్యాయవాది షాదన్ ఫరాసాత్ స్పందిస్తూ రాజ్యసభ చైర్మన్‌ను క్షమాపణలు కోరడంలో ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. చైర్మన్‌ను కలిసి క్షమాపణలు కోరేందుకు చద్దా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఆప్ ఎంపీ క్షమాపణలు చెప్పడం సరైనదేనని కేంద్రం తరపున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా అంగీకరించారు. అనంతరం ఈ కేసులో పురోగతిని నవంబర్ 20న తెలియజేయాలన్న సుప్రీంకోర్టు...తదుపరి విచారణను వాయిదా వేసింది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వ సీనియర్ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై నియంత్రణ కోసం ఉద్దేశించిన 'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ(సవరణ) బిల్లు-2023ను పరిశీలించేందుకు ప్రతిపాదిత సెలక్ట్ కమిటీ అనుమతి తీసుకోకుండానే ఐదుగురు సభ్యుల పేర్లను చేర్చారన్న ఆరోపణలపై గత వర్షాకాల సమావేశాల్లో రాఘవ్ చద్దాను ఆగస్టు 11న రాజ్యసభ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై సభా హక్కుల కమిటీ విచారణ జరిపి, నివేదిక ఇచ్చే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని రాజ్యసభ తెలిపింది. రాఘవ్ చద్దాను సస్పెండ్ చేయాలంటూ పీయూష్ గోయెల్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. నిబంధనల ఉల్లంఘన, అనుచిత ప్రవర్తన, ధిక్కార వైఖరి ఆరోపణలపై ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. దీనిపై సభా హక్కుల కమిటీ విచారణ జరిపి నివేదిక ఇచ్చేంత వరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని చైర్మన్ ప్రకటించారు.

7న వివరణ ఇవ్వండి

రాజ్యసభ సభాహక్కుల కమిటీ శుక్రవారం సమావేశమైంది. ఆప్ నేత రాఘవ్ చద్దా సహా కొంతమంది ఎంపీలపై పెండింగ్‌లో గల సభాహక్కుల ఉల్లంఘన ఫిర్యాదులపై కమిటీ చర్చించింది. నవంబరు 7వ తేదీన వివరణ ఇవ్వాలని రాఘవ్ చద్దాను కమిటీ ఆదేశించింది. ఈ అంశంపై చర్చించడానికి కమిటీ నవంబరు 8న మళ్లీ సమావేశం కానున్నది. పెండింగ్ కేసులన్నింటిపైనా కమిటీ సభ్యులు చర్చించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. రాఘవ్ చద్దా, సంజయ్‌సింగ్, డెరెక్ ఒబ్రెయిన్‌పై ఫిర్యాదుల గురించి కమిటీ సభ్యులు చర్చించారని తెలిపాయి. ఎంపీలపై వచ్చిన ఫిర్యాదుల గురించి పూర్తిస్థాయి విచారణ జరిపి...తుది నివేదికను రాజ్యసభకు సమర్పిస్తుందని పేర్కొన్నాయి.

సమరయోధుల పెన్షన్ మరో రూ.2 వేల పెంపు

పుదుచ్చేరి: స్వాతంత్ర్య సమరయోధుల నెలవారీ పెన్షన్‌ను పుదుచ్చేరి ప్రభుత్వం మరో రూ.2 వేలు పెంచింది. ఈ మేరకు లెఫ్టినెంట్ గవర్నరు తమిళిసై సౌందరరాజన్ కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పుదుచ్చేరి విముక్తి దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల నెలవారీ పెన్షన్ రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచుతామని ఆగస్టు 16న ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. దీనికి లెఫ్టినెంట్ గవర్నరు ఆమోదం తెలిపారు. పెంచిన పెన్షన్‌ను నవంబరు నుంచే అమలు చేయనున్నారు. ఈ నిర్ణయంతో 1201 మంది సమరయోధులకు ప్రయోజనం కలుగుతుందని ఆ ప్రకటన తెలిపింది.

నితిన్ గడ్కరీకి నిరసన సెగ

పాల్ఘర్: కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో శుక్రవారం చేదు అనుభవం ఎదురైంది. నీటి సరఫరా పథకం ప్రారంభోత్సవంలో జాప్యాన్ని ప్రశ్నిస్తూ నితిన్ గడ్కరీకి అగ్రిసేన కార్యకర్తలు నల్లజెండాలతో నిరసన తెలిపారు. వసాయ్ పట్టణంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన గడ్కరీ ఎదుట కార్యకర్తలు నల్లజెండాలు ప్రదర్శించారు. అగ్రిసేన కార్యకర్తలను ఆపడానికి పోలీసులు విఫలయత్నం చేశారు. సూర్య డ్యామ్ నుంచి వసాయ్-విరార్ ప్రాంతానికి 185 ఎంఎల్‌డీ నీటిని తరలించే నీటి సరఫరా పథకం ప్రారంభోత్సవం తీవ్ర జాప్యం జరుగుతోంది.

చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు...

బీజేపీ ఎన్నికల ప్రణాళికలో 20 హామీలు

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో ఎలాగైనా అధికారంలోకి రావాలని కలలు కంటున్న బీజేపీ ఓటర్లను ఆకట్టుకునేందుకు అనేకరకాల ప్రయత్నాలు చేస్తోంది. వివిధ రకాల హామీలు గుమ్మరిస్తోంది. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం విడుదల చేశారు. పెళ్లయిన మహిళలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం సహా మొత్తం 20 హామీలను అందులో గుప్పించారు. తమను గెలిపిస్తే వచ్చే ఐదేళ్లలో చత్తీస్‌గఢ్‌ను పూర్తిగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని అమిత్ షా ఓటర్లకు హామీ ఇచ్చారు.బీజేపీ ప్రకటించిన మేనిఫెస్టోలోని కీలక హామీల్లో కొన్ని ఇలా ఉన్నాయి. రెండేళ్లలో లక్ష ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పేద కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామనీ, క్వింటాలుకు రూ.3100 చొప్పున ధాన్యానికి మద్దతు ధర ఇస్తామనీ, మహిళలకు ఏడాదికి రూ.12 వేలు, భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేస్తామనీ, రాయ్‌పూర్, నయా రాయ్‌పూర్, దుర్గ్, భిలాయ్ ప్రాంతాల అభివృద్ధి కోసం ఢిల్లీ ఎన్‌సీఆర్ మాదిరి రాష్ట్ర రాజధాని ప్రాంతం (ఎస్‌ఈఆర్) ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పండరియాలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌పై విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఖజానాను ఏటీఎంగా మార్చేసి ఢిల్లీకి తరలిస్తున్నారని ఆరోపించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.